
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
కడప
జిల్లా వార్తలు


అరటి.. రైతు ఆవేదన


కొనుగోలుకు రాకపోవడంతో రాలిపోతున్న అరటి కాయలు

రైతులు ఉల్లిపంటకు ధర లేక పొలాల్లోనే వదిలేసి నష్టపోయిన సంఘటనలు ఇప్పటి వరకు చూశాం. అదే పరిస్థితి అరటి సాగు చేసిన రైతులు కూడా ఎదుర్కొంటున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన అరటికి ధర లేకపోవడంతో కోత దశకు వచ్చినా వాటిని చెట్లకు అలాగే వదిలేశారు. గిట్టుబాటు ధర కోసం ఎదురుచూస్తున్నారు. చెట్లపై పాకానికి వచ్చిన కాయలు కొనేవారు లేకపోవడంతో మాగి రాలిపోతున్నాయి. కనీసం పెట్టుబడులు కూడా రాకపోవడంతో అరటి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- పతనమైన అరటి ధరలు
- టన్ను రూ.8వేలు దాటని వైనం

సింహాద్రిపురం / దువ్వూరు, /లింగాల నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): అరటికి గిట్టుబాటు ధర లభించకపోవడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. గతంలో ఎప్పుడూ లేనంతగా ధరలు పడిపోవడంతో పెట్టుబడులు సైతం రాక నష్టాలు చవిచూడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని పులివెందుల, మైదుకూరు, రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లో అరటి ఎక్కువగా సాగులో ఉంది. ఒక్క పులివెందుల నియోజకవర్గంలోనే ఉద్యావన శాఖ అధికారుల లెక్కల ప్రకారం 20,658 ఎకరాల్లో అరటి సాగులో ఉంది. మైదుకూరు నియోజకవర్గంలో దాదాపు 25 వేల ఎకరాల్లో సాగు చేశారు. అధిక పెట్టుబడు లతో కూడిన అరటి పంటకు ధరలు లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.


సింహాద్రిపురంలో గెలలతో ఉన్న అరటి తోట


తోటలో గెలపైనే మాగిపోతున్న అరటి కాయలు

తోటల్లోనే అరటి గెలలు

గత సంవత్సరం మొదటి కోత అరటి కాయలు టన్ను ధర రూ.22 వేల నుంచి రూ.29 వేల వరకు పలికాయి. రెండవ కోత అరటి రూ.15 వేల నుంచి రూ.18 వేలు పలికాయి. ప్రస్తుతం మొదటి కోత అరటి కాయలు టన్ను రూ.5 వేల నుంచి రూ.8వేలతో వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. రెండవ కోత అరటికాయలు రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు ధర పలుకుతోంది. ఇక మూడవ కోత రైతులు తోటల్లోనే అరటి గెలలు వదిలేయాల్సిన దుస్థితి నెలకొంది. దీనికి తోడు అరటి గెలలో ఒక కాయ మాగినా ఆ గెల పనికిరాదని వ్యాపారులు తోటలోనే వదిలేసి వెళతారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమను ఆదుకోకపోతే ఆత్మహత్యలే శరణ్యమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధర వచ్చే వరకు అరటి నిల్వ చేసుకునేందుకు కోల్డ్ స్టోరేజ్‌లు ఏర్పాటు చేయాలని, అరటి దిగుబడులు విదేశాలకు ఎగుమతి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. అరటి కాయలను చీనీ కాయల లాగా నిల్వ ఉంచుకోవడానికి కుదరదని సింహాద్రిపురం మండల ఉద్యాన శాఖ అధికారి మల్లేశ్వర్‌రెడ్డి తెలిపారు. జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్తామన్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



అరటి రైతులకు కనీసం పెట్టుబడులు కూడా రావడం లేదు. ఎకరాకు లక్షన్నర రూపాయలు పెట్టుబడి పెడితే సగం కూడా తిరిగి రాని పరిస్థితి. ప్రభుత్వం అరటి రైతులందరికి పెట్టుబడి రాయితీ మంజూరు చేసి ఆదుకోవాలి. దిగుబడులకు గిట్టుబాటు ధర కల్పించాలి.

- రామచంద్రారెడ్డి, అరటి రైతు, లింగాల

9 ఎకరాల సాగుకు రూ.18 లక్షలు



గతంలో అరటి ధరలు అధికంగా ఉండటంతో నా సొంత పొలం 6 ఎకరాలు, కౌలుకు 3 ఎకరాలు తీసుకుని సాగుచేశాను. ఇప్పటికి సుమారు రూ.18 లక్షలు పెట్టుబడి పెట్టాను. ప్రస్తుతం అరటి ధరలు పతనం కావడంతో పెట్టుబడి డబ్బు కూడా వచ్చే సూచనలు లేవు.

- బి.పరమేశ్వరరెడ్డి, అరటి రైతు, సింహాద్రిపురం

ఏడు ఎకరాల్లో సాగు చేసి నష్టపోయాను



ఏడు ఎకరాల్లో అరటి సాగు చేశాను. పెట్టుబడులు అధికంగా పెట్టాను. తోటలో కాపు బాగా ఉంది. వ్యాపారులు టన్ను రూ.4 వేల ధరతో అడిగారు. తప్పని పరిస్థితుల్లో అమ్మకం చేశాను. నిరుడుతో పోల్చుకుంటే ఈసారి పాతిక భాగం కూడా ధర లేదు. దీంతో బాగా నష్టపోయాను.

- ఎం.సుధాకర్‌రెడ్డి, మూడిండ్లపల్లె గ్రామం, దువ్వూరు మండలం

పెట్టుబడి భారమై..


కాడెద్దులా కొడుకుకు నాగలికట్టి పొలంలో దున్నుతున్న రైతు భాస్కర్‌రెడ్డి

రైతుల దుస్థితికి ఈ చిత్రమే సాక్ష్యం. కొండాపురం మండలంలోని ఏటూరు గ్రామానికి చెందిన రైతు భాస్కర్‌రెడ్డి ఐదు ఎకరాల పొలంలో శనగపంట వేశారు. మొక్కలు ఎదుగుతున్న సమయంలో కలుపు నివారణ, దుక్కి చేయాల్సి ఉంటుంది. ఒక ఎకరంలో కలుపు తీయడానికి 20 మంది కూలీలు అవసరం. ఒకొక్కరికి కూలి రూ.300 చొప్పున రూ.6వేలు పెట్టుబడి పెట్టాలి. కూలీలకు డిమాండ్ ఎక్కువగా ఉన్న సమయంలో ఈ మొత్తం ఇంకా ఎక్కువ అవుతుంది. కూలీల రేట్లు అధికంగా ఉండటం, పొలంలో దుక్కి దున్నడానికి ఎద్దులు లేకపోవడంతో.. రైతు బాస్కర్‌రెడ్డి ఆవేదనకు గురయ్యారు. పంటను కాపాడుకోవాలనే తపనతో తన కొడుకు నవీన్‌కు మార్‌రెడ్డిని కాడెద్దుల స్థానంలో నాగలి కట్టారు. కాడెద్దులా మారిన కొడుకు.. మేడి పట్టిన రైతు పొలంలో శనివారం కలుపు మొక్కలను తొలగించారు. పంట ఎదుగుతున్న తరుణంలో కలుపు తీయకపోతే దిగుబడి తగ్గిపోతుంది ఆధునిక యుగంలోనూ రైతులు పడుతున్న కష్టాలకు ఇది ప్రత్యక్ష సాక్ష్యం. జిల్లాలో పలు చోట్ల రైతులు తమ పంటలను కాపాడుకోవడానికి ఇలా చేస్తున్నారు.

- (కొండాపురం-ఆంధ్రజ్యోతి)

గండికోట అభివృద్ధికి మాస్టర్ ప్లాన్

- సాస్కి పథకం ద్వారా రూ.79 కోట్ల నిధులు
- శ్రీకృష్ణ దేవరాయల విగ్రహం, స్టార్ హోటళ్లు ఏర్పాటు
- కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సమీక్ష



గండికోట అభివృద్ధి పనుల మ్యాపులను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప కలెక్టరేట్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): గండికోటను పర్యాటక కేంద్రంగా ప్రపంచ స్థాయి గుర్తింపు పొందేలా మాస్టర్ ప్లాన్ రూపొందించి అభివృద్ధి చేస్తున్నామని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలులో గండికోట పర్యటకాభివృద్ధి పనులపై డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, జిల్లా పర్యటకశాఖ, ఏపీటీడీసీ అధికారులు, కాంట్రాక్టు ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గండికోటను పర్యాటక హబ్‌గా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. పర్యాటక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సాస్కి (స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్) పథకం ద్వారా రూ.79 కోట్లతో గండికోట పర్యాటక కేంద్రాన్ని అభివృద్ధి చేయనున్నామన్నారు. పర్యాటకులు బసచేసేందుకు స్టార్ హోటళ్లు, ఇతర ఆకర్షణీయమైన నిర్మాణాలు చేపడతున్నామన్నారు. టూరిసులను ఆకట్టుకునేలా గండికోట వద్ద వ్యూ పాయింట్‌తో పాటు చారిత్రక వైభవాన్ని ప్రతిబింబించేలా శ్రీకృష్ణ దేవరాయల విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. లోయ పరిసరాల్లో ఏకో ఫ్రెండ్లీ టెంట్ సిటీ, బోటింగ్‌తో పాటు కోట వద్ద లైటింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. రోప్‌వే, గ్లాస్‌బాటమ్ వాక్‌వే, లైట్ అండ్ సౌండ్ షోలను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. ఈ ఏడాది చివరి నాటికి టెంట్ సిటీని, గ్రాండ్ కాన్యన్‌ను ఆకాశం నుంచి వీక్షించేందుకు హెలిరైడ్స్ సదుపాయం కల్పించనున్నట్లు తెలిపారు. హైదరాబాద్ బెంగళూరు, చెన్నై తదితర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులకు కారవాన్ టూరిజం సర్వీసులు కూడా అందుబాటులోకి వస్తాయన్నారు. జనవరి నెలలో గండికోట ఉత్సవాల నిర్వహణకు మునుపే ఎంట్రెన్స్, ఎలివేషన్ పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. గండికోట పర్యాటక కేంద్రంగా అభివృద్ధిలో భాగంగా చేపట్టే అన్ని రకాల పనులకు సంబంధించి మ్యాపులను, డిజైన్లను పరిశీలించి పలు సూచనలు, సలహాలు అందించారు. పనుల నాణ్యతలో రాజీ లేకుండా పూర్తిచేయాలన్నారు. అభివృద్ధి పనుల పురోగతిపై ప్రతి వారం సమీక్షిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా టూరిజం అధికారి సురేశ్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ ఏడుకొండలు, ఏపీటీడీసీఎగ్జిక్యూటివ్ ఇంజనీరు సుబ్రమణ్యం రాజా, ఇంజనీరు పెంచలయ్య, కన్సల్టెంట్లు సాజిత్ షేక్ , సుమన్‌దాస్, విజయ్ కుమార్, కాంట్రాక్ట్ ప్రతినిధి శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

30 లోగా రైస్‌కార్డులు తీసుకోండి: జేసీ

కడప కలెక్టరేట్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పౌరసరఫరాల పంపిణీలో పారదర్శకత పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం రెండు నెలల కిందట స్మార్ట్ రైస్ కార్డులు అందుబాటులోకి తెచ్చింది. జిల్లాలో 36 మండలాల పరిధిలో 5,73,675 స్మార్ట్ రైస్ కార్డులు రాగా ఇప్పటి వరకు 5,20,083 కార్డుల పంపిణీ జరిగిందని జేసీ అదితిసింగ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వలసలు వెళ్లడం, ఇతరత్రా కారణా ల రీత్యా 53,592 మంది లబ్ధిదారులు కార్డులు తీసుకోలేదని, వారి కుటుంబంలో ఎవరో ఒకరు ఈనెల 30వతేదీ లోగా బయోమెట్రిక్ వేయడం లేదా ఓటీపీ ద్వారా వీఆర్వో వద్ద కానీ చౌకదుకాణం డీలర్ ద్వారా కానీ కార్డు తీసుకోవాలని సూచించారు. ఈ నెలాఖరు లోగా రైస్ కార్డులు తీసుకోకుంటే ప్రభుత్వానికి వెనక్కి పంపించేస్తామని పేర్కొన్నారు.

అల్పపీడనంతో జాగ్రత్త

కడప కలెక్టరేట్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): అల్పపీడనం ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం నాటికి ఆగ్నేయ బంగాళాఖాతంలో వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని దీంతో ఆదివారం కడప, అన్నమయ్య జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని రైతులు వెంటనే వరి కుప్పలు వేసుకోవాలని తెలిపారు. ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

జిల్లా వాసులు ఇద్దరికి చెర్మన్ పదవులు

- ఫిషర్‌మాన్ కో ఆపరేటివ్ సొసైటీస్ చైర్మన్‌గా యాటగిరి రాంప్రసాద్
- షేక్ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ సొసైటీ చైర్మన్‌గా ముక్తియార్



యాటగిరి రాంప్రసాద్, వీఎస్ ముక్తియార్

కడప / ప్రొద్దుటూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): జిల్లా వాసులు ఇద్దరికి రాష్ట్ర స్థాయి పదవులు దర్కాయి. రాష్ట్ర మత్స్య సహకార సంఘాల సమాఖ్య చైర్మన్‌గా కడపలోని ఆర్‌కేనగర్‌కు చెందిన యాటగిరి రాంప్రసాద్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాంప్రసాద్ టీడీపీలో అనతికాలంలోనే కీలక వ్యక్తిగా ఎదిగారు. వైసీపీ హయాంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జరిగిన ప్రతి కార్యక్రమంలో చురుగ్గా పాల్గొన్నారు. వైసీపీ అక్రమాలపై విమర్శలు చేస్తూ వచ్చారు. జగన్ సర్కారు చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేసి జైల్లో పెట్టినప్పుడు కడప నుంచి ఒంటిమిట్ట వరకు పాదయాత్ర చేశారు. ఇక రాయలసీమలోని మత్స్యకారులకు జరిగిన అక్రమాలపై సీమవ్యాప్తంగా పర్యటించి జగన్ ప్రభుత్వాన్న నిలదీశారు. ఆంధ్రజ్యోతిలో సుమారు ఎనిమిదేళ్లపాటు ఆపరేటరుగా పనిచేశారు. కడప టీడీపీలో చురుకైన కార్యకర్తగా ఉంటూ మంత్రి కొల్లు రవీంద్రకు ఆప్తుల్లో ఒకరుగా మారారు. వైసీపీ హయాంలో పార్టీ కోసం కష్టపడడం, ముఖ్యంగా బెస్త కులస్తులకు జరుగుతున్న అన్యాయాలపై పోరాడడంలో కీలక పాత్ర వహించడంతో సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ గుర్తించి చైర్మన్‌గా నియమించారు. ఈ సందర్భంగా యాటగిరి రాంప్రసాద్ మాట్లాడుతూ.. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా మత్స్యకారుల సంక్షేమానికి పాటు పడి, పార్టీని మరింత బలోపేతం చేయడానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

ఏపీ స్టేట్ షేక్ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సొసైటీ చైర్మన్‌గా ప్రొద్దుటూరు మాజీ మున్సిపల్ ఇన్‌చార్జ్ చైర్మన్ వీఎస్ ముక్తియార్‌ను నియమించారు. ఆ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వీఎస్ ముక్తియార్ ప్రస్తుతం టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆయన 1987లో టీడీపీ తరుపున మొదటి సారి మున్సిపల్ కౌన్సిలర్‌గా గెలిచారు. అప్పటి నుంచి ఐదు పర్యాయాలు కౌన్సిలర్‌గా గెలుపొందుతూ వచ్చారు. 2007లో మున్సిపల్ ఇన్‌చార్జ్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. ముస్లిం మైనారిటీల్లో జిల్లాలోనే మంచి గుర్తింపు ఉన్న నాయకుడుగా పేరొందారు. ప్రస్తుతం ప్రొద్దుటూరు అంజుమన్ అధ్యక్షుడుగా కూడా ముస్లింలకు సేవలు అందిస్తున్నారు. ముస్లింలలో అతిపెద్ద షేక్ కులం కార్పొరేషన్‌కు చైర్మన్‌గా ముక్తియార్‌ను నియమించడంపై ముస్లిం వర్గాలు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి.

వరిధాన్యం కొనుగోలుకు 29 కేంద్రాలు

కడప కలెక్టరేట్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రైతులందరూ పండించిన వరిధాన్యాన్ని కనీస మద్దతు ధరతో కొనుగోలు చేసేందుకు 25 మండలాల పరిధిలో 29 కేంద్రాలు ఏర్పాటు చేశామని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వరి పండించిన రైతులు దళారులను నమ్మి మోస పోరాదన్నారు ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర కింద ఇప్పటికే 19 వ తేదీ నుండి వరిదాన్యం కొనుగోల్లు ప్రారంభించిందన్నారు. ఈ క్రాప్, ఈకేవైసీ నమోదు చేసుకున్న రైతులు మాత్రమే వరి దాన్యాన్ని విక్రయించాలన్నారు. వరిదాన్యం నాణ్యతా ప్రమాణాలను బట్టి ధరలు నిర్ణయించడం జరిగిందని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనీ జేసీ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

స్మార్ట్ కిచెన్ పనుల విషయంలో ఆది, భూపేశ్ వర్గీయుల ఘర్షణ

ముద్దనూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో శనివారం స్మార్ట్ కిచెన్ నిర్మాణ పనుల విషయంలో ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి వర్గీయుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఎమ్మెల్యే వర్గానికి చెందిన వినోద్‌కు కత్తి పోటు తగిలింది. సీఐ సమాచారం మేరకు.. రాజులగురువాయపల్లెకు చెందిన సురేంద్రనాథరెడ్డి కొద్ది రోజుల క్రితం ముద్దనూరు బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో స్మార్ట్ కిచెన్ నిర్మాణ పనులు చేపట్టారు. అయితే శనివారం ముద్దనూరుకు చెందిన శ్రీకాంత్ అదే ప్రాంగణంలో మరో చోట స్మార్ట్ కిచెన్ నిర్మాణ పనులు చేపట్టేందుకు భూమి పూజకు సిద్ధమయ్యారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణలో వినోద్ అనే వ్యక్తికి కత్తి తగలడంతో గాయపడ్డాడు. వెంటనే చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు శ్రీకాంత్‌తో పాటు మరో ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.


కత్తిపోటుకు గురై చికిత్స పొందుతున్న వినోద్

అరటి ఎగుమతులు మరింత పెరగాలి


నల్లపురెడ్డిపల్లెలో అరటి తోటను పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న జిల్లా ఉద్యానశాఖ అధికారి జి.సతీశ్

పులివెందుల రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): విదేశాలకు అరటి ఎగుమతులు మరింత పెరిగేందుకు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి జి.సతీశ్ రైతులకు సూచించారు. శనివారం మండలంలోని నల్లపురెడ్డిపల్లెలో పులివెందుల ఉద్యాన శాఖ అధికారి రాఘవేంద్రరెడ్డితో కలిసి అరటి తోటలను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అరటి ఫ్రూట్ కేర్ యాక్టివిటీ పథకంలో భాగంగా నాణ్యతా ప్రమాణాలు పెంచుతూ ఎగుమతి చేసుకునే విధంగా ఉద్యానశాఖ పెద్దఎత్తున రాయితీ ఇస్తోందన్నారు. ఒక హెక్టార్‌కు యూనిట్ ధర రూ.55వేలుగా నిర్ణయించారని, ఇందులో 50శాతం రాయితీ అన్నారు. అరటి గెలలకు పాలిథిన్ తొడుగులు వేసుకునే వారికి రూ.25,500 హెక్టార్‌కు రాయితీ ఇస్తామన్నారు. ఈ అవకాశాన్ని అరటి రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అనధికార నిర్మాణాలను క్రమబద్ధీకరించుకోవాలి

చెన్నూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలో పలుచోట్ల అనధికార లేఅవుట్లు ఉన్నాయని, ప్రభుత్వం ఇచ్చిన గడువులోపు వాటిని క్రమబద్ధీకరించుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి తెలిపారు. శనివారం చెన్నూరుకు వచ్చిన డీపీవో కుడా టౌన్ ప్లానింగ్ అధికారి కృష్ణసింగ్‌తో కలిసి మాట్లాడారు. చెన్నూరుతో పాటు ముండ్లపల్లె, ఉప్పరపల్లె, చిన్నమాచుపల్లె, రామనపల్లె తదతర ప్రాంతాల్లో లేఅవుట్లు వేసి స్థలాలు కొన్నవారు భవిష్యత్తులో వాటిపై బ్యాంకు రుణాలు పొందాలన్నా, ఆ ప్లాట్ల మధ్య రోడ్లు, తాగునీరు, విద్యుత్‌స్తంభాలు ఏర్పాటు జరగాలన్నా చట్టపరంగా స్థలాలను క్రమబద్ధీకరించుకోవాలన్నారు. ప్రభుత్వం తగ్గింపు చార్జీలతో క్రమబద్ధీకరిస్తుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం రికార్డులు పరిశీలించారు.

రైతు సేవా కేంద్రంలో వరి కొనుగోళ్లు

సీకేదిన్నె, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యాన్ని కొనుగోళ్లు చేస్తున్నట్లు ఏవో ఈశ్వర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ఇప్పెంటలో ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఈ-క్రాప్ నమోదు చేసుకుని ఈకేవైసీ పూర్తి చేసిన రైతులు తమ పంటలను స్థానిక వీఏఏ ద్వారా రైతు సేవా కేంద్రంలో అమ్ముకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు, వ్యవసాయ పరపతి సంఘం సిబ్బంది పాల్గొన్నారు.

వారం రోజుల్లో పందులను తరలించాలి

పులివెందుల రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): వారం రోజుల్లో పులివెందుల మున్సిపాలిటీలోని పందులను వేరే ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రాముడు శనివారం ఒక ప్రకటనలో పందుల యజమానులను ఆదేశించారు. పులివెందుల మున్సిపాలిటీలో పందుల బెడద ఎక్కువగా ఉంటోందని, ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. పందులను పట్టణానికి దూరంగా తరలించాలని పలుమార్లు చెప్పినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. కావున ఏడు రోజుల్లోగా తరలించాలని లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ద్విచక్ర వాహనం ఢీ వృద్ధురాలికి గాయాలు

కడప క్రైం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కడప నగరం రామరాజుపల్లె వద్ద ఓ వృద్ధురాలు రోడ్డు దాటుతుండగా ఎదురుగా వచ్చిన బైకు ఢీకొంది. ఈ ప్రమాదంలో చాగలమర్రి గంగమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆమెను 108 వాహనంలో రిమ్స్‌కు తరలించారు. స్థానికులు కడప ట్రాఫిక్ పోలీసులకు సమాచారం ఇచ్చారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలి

● వన్‌టౌన్ సీఐ చిన్నపెద్దయ్య

కడప క్రైం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని వన్‌టౌన్ సీఐ చిన్నపెద్దయ్య తెలిపారు. జిల్లాలో నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా శనివారం వివిధ పోలీసుస్టేషన్‌ల పరిధిలోని రౌడీషీటర్లు, నేరచరిత్ర ఉన్నవారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సత్ప్రవర్తనతో జీవించాలని, నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని సూచించారు. చట్ట వ్యతిరేక కార్యకలపాల్లో పాల్గొంటే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రంలో అమ్మకాలు జరపాలి

● జిల్లా వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు చంద్రానాయక్

చక్రాయపేట, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): రైతులు వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ద్వారా అమ్మకాలు జరపాలని జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకులు చంద్రానాయక్ అన్నారు. శనివారం మండల కేంద్రమైన చక్రాయపేట రైతు సేవ కేంద్రాన్ని వరి ధాన్యం కొనుగోలు కేంద్రంగా కేటాయించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గండికొవ్వూరు, మారెళ్లమడక, కుమారకాల్వ గ్రామాలలో సుమారు 250 మంది రైతులు 1350 ఎకరాలలో వరి పంటను సాగు చేస్తున్నారన్నారు. గ్రేడ్-ఏ రకం క్వింటాల్‌కు రూ.2389, సాధారణ రకం క్వింటాల్‌కు రూ.2369గా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అదేవిధంగా తేమ శాతం 17శాతానికి మించరాదని, చెత్త, రాళ్లు, తాలు ఒక శాతం, చెడిపోయిన, రంగుమారిన విత్తనాలు ఐదు శాతం, పరిపక్వానికి రాని, వంకర తిరిగిన గింజలు మూడు శాతానికి మించకూడదన్నారు. కార్యక్రమంలో పులివెందుల ఏడీఏ ప్రభాకర్‌రెడ్డి, ఏవో చంద్రశేఖర్‌రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి రమణారెడ్డి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది

వేంపల్లె, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన వరిధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేసే ఏర్పాట్లు చేస్తున్నామని వ్యవసాయ శాఖ జిల్లా సంయుక్త సంచాలకులు చంద్రానాయక్ తెలిపారు. వేంపల్లె మండలం ఇడుపులపాయలోని రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేయనున్న వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఏ రైతు కూడా వరి ధాన్యాన్ని అమ్ముకోవడంలో ఇబ్బందులు పడకూడదనేది ప్రభుత్వ ఉద్దేశమన్నారు. పులివెందుల ఏడీఏ ప్రభాకర్‌రెడ్డి, తహసీల్దార్ హరినాథ్‌రెడ్డి, రైతు సేవా కేంద్రాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



చక్రాయపేటలో వరి ధాన్యాన్ని పరిశీలిస్తున్న జేడీఏ చంద్రానాయక్

సీబీఆర్ మరమ్మతులకు చర్యలు

లింగాల, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (సీబీఆర్) మరమ్మతులకు చర్యలు తీసుకుంటున్నామని తుంగభద్ర ప్రాజెక్టు హైలెవెల్ కెనాల్ చైర్మన్ జోగిరెడ్డి, జీఎన్ఎస్ ఎస్ఈ కొండారెడ్డి అన్నారు. మండలంలోని పార్నపల్లె సమీపంలో ఉన్న సీబీఆర్ ప్రాజెక్టును శనివారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్ఓఎఫ్ లీకేజీ, గేట్లకు రబ్బర్ సీల్‌లు, జంగిల్ క్లియరెన్స్, రక్షణ గోడకు మరమ్మతులు అన్ని పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు విశ్వనాథ్‌రెడ్డి, పార్నపల్లె టీడీపీ నాయకుడు ధనుంజయనాయుడు, పీబీసీ ఈఈ వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి స్కూలుగేమ్స్ ఫెడరేషన్ పరిశీలకుడిగా గణేశ్‌బాబు



చెన్నూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయిలో బాలబాలికలకు జరిగే స్కూలుగేమ్స్ ఫెడరేషన్‌లో అండర్-19 పోటీల పరిశీలకుడిగా మండలంలోని రామనపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ పోలంకి గణేశ్‌బాబును నియమించారు. ఈనెల 25న కర్నూలు నగరంలోని ఆదర్శ పాఠశాలలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి స్కూలుగేమ్స్‌కు తనను బాధ్యతగా వ్యవహరించాలని, అక్కడ మరింత బాధ్యతగా వ్యవహరిస్తే వచ్చేనెల 24, 29వ తేదీ వరకు ఢిల్లీలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో స్కూలుగేమ్స్ తరఫున తనను పరిశీకులుగా పంపిస్తారని, ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని గణేశ్‌బాబు తెలిపారు.

రేపటి నుంచి అంతర్ కళాశాలల క్రీడలు, సాంస్కృతిక పోటీలు

పులివెందుల, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పులివెందులలోని ఆహార విజ్ఞాన శాస్త్ర, సాంకేతిక కళాశాలలో ఈనెల 24వ తేదీ నుంచి అంతర్ కళాశాలల పోటీలు ప్రారంభమవుతాయని కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.మాధవ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి గాను మొదటి దశ అంతర్ కళాశాలల క్రీడలు, ఆటలు, సాంస్కృతిక, సాహిత్య పోటీలు ఉంటాయనానరు. 24 నుంచి 26వరకు ఈ పోటీలలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 19 కళాశాలల జట్లు పాల్గొంటాయన్నారు. పులివెందులలోని కళాశాల మైదానంలో బాస్కెట్‌బాల్, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, షటిల్ బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, చెస్ క్యారమ్స్ వంటి క్రీడలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలి

కడప క్రైం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని చిన్నచౌకు ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. నగరంలో శనివారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాల రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో ప్రజల ప్రాణభద్రత కోసం ముఖ్యమైన ట్రాఫిక్ నియమాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. వాహనదారులు హెల్మెట్, సీటు బెల్టు తప్పనిసరి ధరించాలన్నారు. రద్దీ రోడ్లలో నెమ్మదిగా, జాగ్రత్తగా డ్రైవ్ చేయాలన్నారు. మద్యం తాగి, మొబైల్ మాట్లాడుతూ వాహనాలు డ్రైవ్ చేయరాదన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

వల్లూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ పెద్ద ఓబన్న తెలిపారు. మండల పరిధిలోని కుమారునిపల్లె గ్రామంలో శనివారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు సైబర్ నేరాలు, వ్యక్తిగత భద్రత, మహిళల రక్షణ, ఆపద సమయాల్లో ముఖ్యమైన హెల్ప్‌లైన్ నెంబర్లు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో ఎటువంటి గొడవలకు తావివ్వకుండా అందరూ పరస్పరం మంచిగా మెలుగుతూ సుఖంగా జీవించాలన్నారు. ఏ సమస్య వచ్చినా పోలీసులను సంప్రదించాలన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఐ పెద్ద ఓబన్న

కూటమి పాలనలో ప్రజలకు ఒరిగింది శూన్యం

● వైసీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): 18 నెలలుగా కొనసాగుతున్న కూటమి ప్రభుత్వపాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదని వైసీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి విమర్శించారు. శనివారం నగరంలోని వైసీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలను మాటలతో మాత్రమే మోసం చేసిన ప్రభుత్వమిదేనని ఆరోపించారు. రైతుల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. సకాలంలో ఎరువులు, యూరియా అందక పంటలు దెబ్బతిన్నాయని, వందలాది మంది రైతులు నష్టాలను భరించలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నా ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. అకాల వర్షాలతో లక్షలాది ఎకరాల్లో పంటలు నష్టపోయినా ఎలాంటి ఉపశమన చర్యలూ తీసుకోలేదన్నారు. పత్తి, వరి, ఉల్లి, మిర్చి, టమోటా, మొక్కజొన్న వంటి పంటలకు సరైన మద్దతు ధరలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మండిపడ్డారు. బచావత్ ట్రిబ్యునల్ ప్రకారం రాయలసీమకు కేటాయించిన ప్రతి టీఎంసీ నీటిని ప్రభుత్వం అందించాలని డిమాండ్ చేశారు. డబుల్ ఇంజన్ సర్కార్ పేరుతో పెద్దపెద్ద హామీలు ఇచ్చినా రాష్ట్రానికి ఏమాత్రం లాభం చేకూరలేదన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు పాకా సురేశ్, పోలీసు సునీల్‌కుమార్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

నగర అభివృద్ధికి ఎన్ని నిధులు తెచ్చారు

● మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాష



విలేకరులతో మాట్లాడుతున్న అంజాద్‌బాషా

కడప ఎర్రముక్కపల్లె, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రజలపై ఏమాత్రం అభిమానం ఉన్నా కడప నగర అభివృద్ధికి ఎన్ని నిధులు తీసుకువచ్చారో చెప్పాలని మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాష సవాల్ విసిరారు. శనివారం నగరంలోని తన క్యాంప్ కార్యాలయంలో అంజాద్‌బాషా విలేకరులతో మాట్లాడుతూ కడప ఎమ్మెల్యే మాటల్లో ఆక్రోషం, ఆవేశంతో పాటు అసత్యం చెబుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. 18 నెలల కాలంలో కడప అభివృద్ధికి కేవలం బుగ్గవంకలో జమ్ము తొలగించేందుకు రూ. 3.60కోట్లు నిధులు తెచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. మూడు నెలలకే యధావిధిగా జమ్ము మళ్లీ పెరిగిందని, దీనికోసం మళ్లీ నిధులు కేటాయించుకోవడం చేస్తారని, బుగ్గవంక ఎమ్మెల్యేకు, తన భర్తకు ఏటీఎంగా ఉందని ఎద్దేవా చేశారు. కడప నగరానికి శాశ్వత తాగునీటి పరిష్కారానికి సంబంధించి గత ప్రభుత్వం బ్రహ్మంసాగర్ నుంచి 1.50టీఎంసీల నీటిని తెచ్చేందుకు రూ.570కోట్లు మంజూరు చేసిందని, కడప ప్రజలపై ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా ఆ పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జైచంద్రారెడ్డి, షఫీ, అజ్మతుల్లా, సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక మార్పులతో లేబర్ కోడ్స్

కడప సెవెన్‌రోడ్స్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కార్మికులు పోరాడి సాధించుకున్న 29 చట్టాలను రద్దు చేసి కార్మిక వ్యతిరేక మార్పులతో నాలుగు లేబర్ కోడ్‌లను కేంద్ర ప్రభుత్వం అమలులోకి తీసుకువస్తోందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి విమర్శించారు. నగరంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద లేబర్ కోడ్స్ అమలు ఉత్తర్వులను శనివారం ఏఐటీయూసీ, సీఐటీయూ సంయుక్తంగా నిరసన తెలిపారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మనోహర్ మాట్లాడుతూ ఏదైనా పరిశ్రమ లే-ఆఫ్ చేయాలన్నా, లాకౌట్ చేయాలన్నా వందమంది అంతకు మించి కార్మికులు ఉంటే ఆ సంస్థ తప్పనిసరిగా ప్రభుత్వ అనుమతి తీసుకోవాలనే నిబంధనను ఇప్పుడు 300 మంది కార్మికులు ఉన్న కంపెనీలకు వర్తించేవిధంగా మార్చారని, దీనివల్ల కంపెనీల యజమానులు తమ ఇష్టానుసారం లే-ఆఫ్, లాకౌట్లు చేసుకోవచ్చని, కార్మికుల హక్కుల మీద, ఉద్యోగ భద్రత మీద, జీతభత్యాల మీద వేటు వేసేందుకు యాజమాన్యాలకు ఆయుధంగా ఉంటుందని వాపోయారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బాదుల్లా, మద్దిలేటి, సీపీఎం నగర కార్యదర్శి రామ్మోహన్‌రెడ్డి, సీఐటీయూ చంద్రారెడ్డి, వెంకటసుబ్బయ్య, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలి

కడప ఎడ్యుకేషన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నూతన విద్యా విధానాన్ని అనుసరించి నైతిక విలువలతో ఉన్నత శిఖరాలకు ఎదగాలని వైవీయూ జువాలజీ హెచ్‌వోడీ డాక్టర్ ఎస్వీ రమణ తెలిపారు. శనివారం కడప నగరం ప్రభుత్వపురుషుల కళాశాల రవీంద్రనాథ్‌ఠాగూర్ ఆడిటోరియంలో నూతన విద్యార్థుల ఫెస్ట్-25 కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవీంద్రనాథ్ మాట్లాడుతూ శిక్షణ, క్రమశిక్షణతో చదివి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. హెచ్‌వోడీ డాక్టర్ పి.రవిశేఖర్ విద్యార్థుల విజయం ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు గర్వకారణమన్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వైవీయూ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రమేశ్, అధ్యాపకులు డాక్టర్ సావిత్రి, డాక్టర్ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నేతన్నలకిచ్చిన హామీని అమలు చేయాలి

కడప మారుతీనగర్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు నేతన్నలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని జాతీయ చేనేత ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు అవ్వారు మల్లికార్జున డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ప్రకాశ్‌నగర్‌లోని ఐక్యవేదిక కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చేనేత సహకార సంఘం ఎన్నికలు జరగకుండా పీఏసీలను వేశారన్నారు. ఆ పీఏసీలు పనిచేయక పోగా కార్మికులకు పని కల్పించడంలో వైఫల్యం చెందారన్నారు. అలాగే పరపతి సంఘాల బోర్డులు చేనేత కార్మికుల పట్ల వివక్ష చూపుతున్నాయన్నారు. పెండింగ్‌లో వున్న త్రిఫుల్ ఆర్ ఫండ్‌ను వెంటనే విడుదల చేయాలన్నారు. చేనేత జౌళి శాఖ కమిషనర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బాలికలకు చదువు ఎంతో అవసరం : సీఐ

వేంపల్లె, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): బాలికలకు చదువు ఎంతో అవసరమని, చదువుతోనే జీవితంలో రాణించగలరని సీఐ నరసింహులు తెలిపారు. స్థానిక అక్షర జూనియర్ కళాశాలలో బాల్య వివాహాలు, లైంగిక వేధింపులు, సైబర్‌క్రైం, శక్తియాప్ తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఎక్కడైన సమస్య ఉందంటే వెంటనే 112 నెంబర్‌కు ఫోన్ చేయాలన్నారు.

'పిల్లలను గమనిస్తుండాలి'

వీరపునాయునిపల్లె, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మద్యం, డ్రగ్స్, గంజాయి వంటి చెడు వ్యసనాలకు అలవాటు పడకుండా తల్లిదండ్రులు పిల్లలను గమనిస్తుండాలని ఎస్ఐ మంజునాథ్ సూచించారు. మండలం పరిధిలోని ఉరుటూరు గ్రామంలో శుక్రవారం రాత్రి 11గంటల సమయంలో ఎస్ఐ ఆధ్వర్యంలో పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో సమావేశం నిర్వహించి వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. ఇటీవల కాలంలో వాట్సప్‌కాల్ చేసి డిజిటల్ అరెస్టు చేస్తున్నామని, ఇంటి నుంచి బయటకు వెళ్లవద్దని, మాదక ద్రవ్యాల కేసులో ఇరుక్కున్నారని, ఆధార్‌కార్డును దుర్వినియోగం చేశారని, మీ పిల్లలపై డ్రగ్స్ కేసు నమోదైందని, సీబీఐ లేదా ఈడీ లేదా సీఐడీ లేదా కోర్టు నుంచి అధికారులుగా పరిచయం చేసుకొని బెదిరింపులకు పాల్పడి డబ్బులను కొల్లగొడుతున్నారన్నారు. ఈ తరహా ఫోన్ కాల్ వస్తే 112 లేదా 1930కి సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో పీఎస్ఐ సూర్యనారాయణరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



ఉరుటూరులో పల్లెనిద్రలో ఎస్ఐ మంజునాథ్

చేపల వ్యాపారానికి స్థలం కేటాయించాలి



ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డికి వినతిపత్రం అందిస్తున్న మత్స్యకారులు

చెన్నూరు/కమలాపురం రూరల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): చెన్నూరులో మత్స్యకారులు అధికంగా ఉన్నారని, స్థానికంగా వ్యాపారం చేసుకునేందుకు సరైన స్థలం కేటాయించాలని రాష్ట్ర బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ మల్లె వెంకటసుబ్బయ్య కోరారు. ఈ మేరకు కడప నగరంలోని బిల్టప్ వద్ద ఉన్న ఎమ్మెల్యే కార్యాలయంలో శనివారం నిర్వహించిన ప్రజాదర్బారు కార్యక్రమంలో ఎమ్మెల్యే పుత్రా కృష్ణచైతన్యరెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ చెన్నూరులో దాదాపు 250కి పైగా ఇళ్లు చేపల వేటతో జీవనం సాగిస్తున్నామని, ఏటా రూ.12కోట్లు వ్యాపారం జరుగుతుందని, కానీ ఇంతవరకు వ్యాపారం చేసుకునేందుకు సరైన స్థలం లేదన్నారు. హైవేరోడ్డు పక్కన వ్యాపారానికి, రాకపోకలకు అనువుగా ఉండే విధంగా కనీసం పది సెంట్ల స్థలం కేటాయిస్తే మత్స్యకారుల జీవనానికి ఇబ్బంది లేకుండా ఉంటుందన్నారు. అలాగే కమలాపురంలో నిర్వహించిన ప్రజాదర్బారులో నియోజకవర్గమైన కమలాపురంలో ఎస్సీ హాస్టలు ఏర్పాటుకు కృషి చేయాలని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నరసింహ మాదిగ కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డికి వినతిపత్రం అందించారు.

రైతుల పరిస్థితి దయనీయం : తులసిరెడ్డి

వేముల, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): చంద్రబాబు పాలనలో రాష్ట్రంలో రైతుల పరిస్థితి దయనీయంగా ఉందని రాజ్యసభ మాజీ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ తులసిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం మండలంలోని బెస్తవారిపల్లె వద్ద అరటితోటలను ఆయన పరిశీలించారు. గత సంవత్సరం టన్ను అరటి రూ.15వేలు పలికితే ఈ ఏడాది వ్యాపారులు కొనడం లేదని, అడిగేవారే లేరని వాపోయారు. అలాగే చీనీ, ఉల్లి, పసుపు, మిర్చి, పొగాకు, పూలు ఇలా అన్ని పంటల పరిస్థితీ ఇలాగే ఉందన్నారు. ప్రభుత్వం ఇలాంటి పరిస్థితుల్లో జోక్యం చేసుకొని కనీస మద్దతు ధర కల్పించి పంటను కొనాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అమర్‌నాథరెడ్డి, ఐచర్ రమణ, చప్పిడి గంగాధర్, ఉత్తన్న, చిన్నకోట్ల నాగరాజు, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శక నాయకత్వం కోసం దరఖాస్తు చేసుకోవాలి

● జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎన్‌డీ విజయజ్యోతి



కడప కలెక్టరేట్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ పూర్వ వైభవానికి పాటుపడాలనే తపన, ఆకాంక్ష ఉన్న నాయకులు దరఖాస్తులను సంఘటన్ సుజన్ అభియాన్ కేంద్ర కమిటీకి సమర్పించాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎన్‌డీ విజయజ్యోతి పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఆమె పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతీయ కాంగ్రెస్ జిల్లాల వారీగా ధృడమైన నాయకత్వాన్ని కోరుకుంటోందన్నారు. పార్టీపై సదాభిప్రాయంతో ప్రజలకు మంచి సేవలందిచాలన్న ధృఢ సంకల్పంతో పనిచేసే నాయకులను గుర్తించేందుకు ఏఐసీసీ, పీసీసీ, జిల్లా నుండి ఐదుగురు సభ్యుల బృందం ఈనెల 24వ తేదీ నుండి 10 రోజుల పాటు నియోజక వర్గాలు, మండలాల వారీగా పర్యటిస్తారన్నారు. కాంగ్రెస్‌వాదులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ గౌస్‌పీర్, జిల్లా ఉపాధ్యక్షుడు సిరాజుద్దీన్, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సుశీల్‌కుమార్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు మామిళ్ల బాబు, నేతలు గంగయ్య, జాబీర్ అలీ, సర్దారీ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం : ఎమ్మెల్సీ



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి

పులివెందుల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి అన్నారు. శనివారం పులివెందులలోని వైఎస్సార్ ఇండోర్ స్టేడియంలో సాఫ్ట్ బాల్ అండర్-14 పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొత్త స్పోర్ట్స్ పాలసీతో ఏపీ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో శ్రీకాంత్‌రెడ్డి, శివశంకర్ రెడ్డి, విజయప్రతాప్‌రెడ్డి, కొండారెడ్డి, ఎంఈఓలు పాల్గొన్నారు.

రైతులు, ప్రాజెక్టుల గురించి మాట్లాడే అర్హత జగన్‌కు లేదు : రవిశంకర్‌రెడ్డి

కడప మారుతీనగర్, నవంబర్ 22(ఆంధ్రజ్యోతి): రైతుల ప్రయోజనాలతో పాటు రాష్ట్రంలోని ప్రాజెక్టుల గురించి మాట్లాడే అర్హత జగన్ మోహన్‌రెడ్డికి లేదని టీడీపీ తెలుగు వాణిజ్యవిభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సానపురెడ్డి రవిశంకర్‌రెడ్డి అన్నారు. శనివారం కడపలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కృష్ణా జలాల చరిత్ర-ఆవశ్యకతపై ఏమాత్రం అవగాహనలేని జగన్ తన ఐదేళ్ల పాలనలో తీవ్ర అన్యాయం చేశారని ధ్వజమెత్తారు. రాజకీయ లబ్ధి కోసం కృష్ణా ట్రిబ్యునల్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు సరైన వాదనలు వినిపించలేదని జగన్ ఆర్భాటపు వాఖ్యలు చేయడం వింతగా వుందన్నారు. జగన్‌పాలనలో వరదలు, కరువులు తప్ప రైతులకు కనీసం ఇన్‌పుట్ సబ్సిడీ కూడా దక్కలేదన్నారు. నీటిని పొదుపు చేసే డ్రిప్ ఇరిగేషన్, మైక్రో ఇరిగేషన్‌లను జగన్ అటకెక్కించారన్నారు. వ్యవసాయాన్ని లాభసాటి చేసే క్రమంలో ముఖ్యమంత్రి విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారన్నారు. అందులో భాగంగా ఈనెల 24 నుండి 29వ తేదీ వరకు రైతన్నా.. మీకోసం కార్యక్రమానికి రూపకల్పన చేశారన్నారు. వ్యవసాయ సంక్షోభాలకు శాశ్వతపరిష్కారం కోసం చంద్రన్న పంచసూత్రాలను రూపొందించడం శుభకరమన్నారు.

వైవీయూ అధికారులపై కేసు నమోదు చేయాలి

కడప సెవెన్ రోడ్స్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): యోగి వేమన విశ్వ విద్యాలయంలో జరిగిన నియామకాలలో రిజర్వేషన్ నిబంధనలు పాటించామని, అక్రమాలు జరగలేదని ప్రభుత్వానికి అబద్దాలు చెబుతున్న వైవీయూ అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2019-2024మధ్య జరిగిన బోధన, బోధనేతర సిబ్బంది నియామకాలలో జరిగిన అక్రమాలపై ఆధారాలతో గవర్నర్‌కు, ప్రభుత్వానికి ఫిర్యాదు చేశామన్నారు. ప్రభుత్వం విచారణకు ఆదేశించినా వైవీయూ రిజిస్ట్రార్ అక్రమార్కుల వద్ద ముడుపులు తీసుకున్నారని ఆరోపించారు. పీస్ మీల్ పేరుతో ఎటువంటి నోటిఫికేషన్ లేకుండా ఐదు ఉద్యోగాలు భర్తీ చేశారన్నారు. అవినీతి, అవకతవకలకు పాల్పడిన అధికారులను పదవుల నుంచి తొలగించాలని, వారిపై విచారణ జరపాలని డిమాండు చేశారు.

బంగారు వ్యాపారి కిడ్నాప్ కలకలం

- కిడ్నాపర్‌లు పోలీసులే !
- రాత్రంతా వ్యాపారి అక్రమ నిర్బంధం
- ఎమ్మెల్యే వరద జోక్యంతో ఇంటికి చేరిన వ్యాపారి

ప్రొద్దుటూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరులో బంగారు వ్యాపారి కిడ్నాప్ వ్యవహారం కలకలం రేపింది. పట్టణ నడిబొడ్డు శివాలయం సర్కిల్లో శుక్రవారం రాత్రి 8.30 గంటల సమయంలో భార్యతో కలిసి స్కూటర్‌లో వెళుతున్న తనకంటి జ్యూవెలర్స్ యజమాని తనకంటి శ్రీనివాస్‌ను కారులో వచ్చిన వ్యక్తులు తాము పోలీసులమని చెప్పి బలవంతంగా తీసుకెళ్లారు. తన భర్తను ఎక్కడికి తీసుకెళుతున్నారని వారిని ప్రశ్నించగా త్రీటౌన్ పోలీసు స్టేషనుకు రమ్మని చెప్పారు. ఆమె హుటాహుటిన త్రీటౌన్ పోలీసు స్టేషనుకు వెళ్లి పోలీసులను అడుగగా తాము ఎవరిని తీసుకురాలేదని చెప్పారు. దీంతో ఆమె ఆందోళన చెంది రాత్రంతా ప్రొద్దుటూరులోని అన్ని పోలీసు స్టేషన్లకు వెళ్లి విచారించినా తన భర్త ఆచూకి తెలపకపోవడంతో ఆమె కన్నీరుమున్నీరుగా విలపించారు. చివరకు అతడిని తీసుకెళ్లిందని పోలీసులే అని తేలింది.

శ్రీనివాస్‌పై చీటింగ్ కేసు నమోదు

హైదరాబాదుకు చెందిన హేమంత్ శర్మ అనే బంగారు వ్యాపారి 2015 నుంచి ప్రొద్దుటూరుకు చెందిన తనికంటి శ్రీనివాస్‌కు బంగారు ఆభరణాలు పంపించేవాడు. నగలు అమ్మి ఎప్పటికప్పుడు శ్రీనివాస్ డబ్బులు పంపించేవాడు. ఈ నమ్మకంతో 2018లో హేమంత్ శర్మ మరోవ్యాపారితో కలిసి సుమారు 10 కిలోల బంగారు నగలను నాలుగు నెలల కాలంలో శ్రీనివాస్‌కు పంపించారు. నగలకు సంబంధించి డబ్బులు ఇవ్వకుండా శ్రీనివాస్ కాలయాపన చేస్తూ వచ్చారు. ఈ క్రమంలో 2021లో నగల డబ్బులు ఇస్తామని హేమంత్ శర్మను ప్రొద్దుటూరుకు రప్పించి శ్రీనివాస్ అతని అనుచరులు కారులో తీసుకెళ్లి పట్టణ శివారులో చితకబాదారు. జరిగిన సంఘటనపై నాడు హేమంత్ శర్మ పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. ఈ క్రమంలో ఈ నెల 20వ తేదీ గురువారం త్రీటౌన్ పోలీసు స్టేషన్లో తనికంటి శ్రీనివాస్ 10 కిలోల బంగారు తీసుకున్నాడని డబ్బులు అడిగితే దాడి చేశారని, చంపుతానని బెదిరిస్తున్నాడని హేమంత్ శర్మ ఫిర్యాదు చేశారు. ఆ మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి తాడిపత్రిలో ఉంటున్న తన తమ్ముడు వెంకటస్వామితో పాటు తనను పోలీసులు అదుపులోకి తీసుకుని కొర్రపాడు రోడ్డులోని ఒక ప్రైవేటు ఎస్టేట్‌లో నిర్బంధించారని శ్రీనివాస్ ఆరోపించారు. ఈ విషయం శనివారం తెలియడంతో బంగారు వ్యాపారులు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డిని కలిశారు. ఎమ్మెల్యే జోక్యంతో శనివారం రాత్రి పోలీసులు శ్రీనివాస్‌ను వైఎంఆర్‌కాలనీలో ఉన్న అతని ఇంటికి తీసుకువచ్చారు.



బంగారు వ్యాపారి శ్రీనివాస్ ఇంట్లో పోలీసులు

ఆస్తిపత్రాలు తీసుకెళ్లిన పోలీసులు?

ఒన్‌టౌన్ సీఐ తిమ్మారెడ్డి త్రీటౌన్ సీఐ వేణుగోపాల్ విజయవాడ నుంచి వచ్చిన వసంత్ అనే పోలీసు అధికారి శ్రీనివాస్ ఇంట్లో కూర్చొని వ్యాపారి హేమంత్ శర్మకు బాకీ డబ్బులు ఇవ్వాలని కోరారు. హేమంత్ శర్మకు తాను బాకీ లేనని తన తమ్ముడు బాకీ ఉన్నాడని శ్రీనివాస్ తెలిపాడు. తమ్ముడు తాను విడిపోయి చాలా ఏళ్లు అయిందన్నాడు. అయినా పోలీసులు రూ.కోట్ల విలువైన ఆస్తి పత్రాలతో పాటు తనికంటి జ్యూవెలర్స్ దుకాణం తాళాలు తీసుకెళ్లారని శ్రీనివాస్ ఆరోపించారు. దీనిపై త్రీటౌన్ సీఐ వేణుగోపాల్‌ను ఆంధ్రజ్యోతి ఫోన్‌లో వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన స్పందించలేదు. కాగా.. సివిల్ పంచాయితీలో పోలీసులు కిడ్నాపర్లుగా మారిన తీరుపై తీవ్ర విమర్శలకు దారితీసింది. చీటింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు బంగారు వ్యాపారికి 41 నోటీసు ఇచ్చి విచారించే అవకాశం ఉన్నా అతడిని బలవంతంగా కారులో ఎత్తుకెళ్లి రాత్రంతా నిర్బంధించడంపై ఆరోపణలు వస్తున్నాయి.

25 నుంచి ఏసీఏ అండర్-14 ఇంటర్ జోనల్ క్రికెట్ మ్యాచ్‌లు

కడప స్పోర్ట్స్, నవంబర్ 22 (ఆంధ్రజ్యోతి): కడపలో ఈనెల 25వ తేదీ మంగళవారం నుంచి డిసెంబర్ 8వ తేదీ వరకు ఏసీఏ అండర్-14 ఇంటర్ జోనల్ రెండు రోజుల క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి అవ్వారు రెడ్డిప్రసాద్ తెలిపారు. క్రికెట్ మ్యాచ్‌లు నగర రిమ్స్ సమీప వైఎస్ రాజారెడ్డి ఏసీఏ స్టేడియంతో పాటు కేఎస్ఆర్ఎం, కేఓఆర్ఎం క్రికెట్ మైదానాలలో జరగనున్నట్లు వెల్లడించారు. మ్యాచ్‌ల వివరాలిలా.... ఈనెల 25 నుంచి 26వ తేదీ వైయస్ఆర్ఆర్ స్టేడియంలో సౌత్‌జోన్ విన్నర్-నార్త్‌జోన్ విన్నర్ జట్ల మధ్య మ్యాచ్ జరగనుంది. అలాగే కేవోఆర్ఎం స్టేడియంలో సెంట్రల్‌జోన్ విన్నర్-రెస్ట్ ఆఫ్‌సౌత్‌జోన్, కేఎస్ఆర్ఎంలో రెస్ట్‌ఆఫ్ నార్త్‌జోన్-రెస్ట్‌ఆఫ్ సెంట్రల్‌జోన్‌ల మధ్య మ్యాచ్‌లు ఉంటాయని తెలిపారు. 28 నుంచి 29వ తేదీ వైయస్ఆర్ఆర్ స్టేడియంలో సెంట్రల్‌జోన్ విన్నర్స్-రెస్ట్‌ఆఫ్‌సెంట్రల్‌జోన్, కేవోఆర్ఎం స్టేడియంలో సౌత్ జోన్‌విన్నర్-రెస్ట్‌ఆఫ్ నార్త్‌జోన్, కేఎస్ఆర్ఎంలో నార్త్‌జోన్ విన్నర్-రెస్ట్‌ఆఫ్ సౌత్‌జోన్‌ల మధ్య పోటీలు జరగనున్నాయని తెలిపారు. ఈ పోటీలు డిసెంబర్ 8వ తేదీ వరకు సాగుతాయని రెడ్డి ప్రసాద్ వెల్లడించారు.

క్రీడా పోటీలను సద్వినియోగం చేసుకోవాలి

రాయచోటిటౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా డిసెంబరు 3న దివ్యాంగ క్రీడాకారుల జిల్లాస్థాయి క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడా సాధికార అధికారి జి.చంద్రశేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ క్రీడా సాధికార సంస్థ (సాప్) ఆదేశాల మేరకు అన్నమయ్య జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 25న రాయచోటి మండల పరిధిలోని దిగువ అబ్బవరం గ్రామం నక్కావాండ్లపల్లె వద్ద గల డీఎస్ఏ క్రికెట్ స్టేడియంలో పారా అథ్లెటిక్ క్రీడా పోటీలు ఉంటాయన్నారు. బ్యాడ్మింటన్, చెస్, అథ్లెటిక్స్‌లో 100 మీటర్లు, 200 మీటర్లు పరుగు, లాంగ్‌జంప్, షాట్‌పుట్, వీల్‌చైర్ పోటీలు ఉంటాయన్నారు. జిల్లాలోని అన్ని మండలాల నుంచి క్రీడాకారులు అవగాహన ర్యాలీలో పాల్గొనేటట్లు స్థానిక క్రీడా అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. మరింత సమాచారం కోసం జిల్లా క్రీడా ప్రాధికార అధికారి 871262275ను సంప్రదించాలన్నారు.

భావ వ్యక్తీకరణ నైపుణ్యాలు అవకాశాలకు మార్గాలు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): భావవ్యక్తీకరణ నైపుణ్యాలు కలవారే ఉద్యోగ ఉపాధి అవకాశాలు ఎక్కడైనా సొంతం చేసుకోగలుగుతారని బెంగుళూరు ఎస్ఈఏ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్‌శాఖ అసోసియేట్ ప్రొఫెసర్ ఎస్‌బీ అనిల్‌కుమార్ అన్నారు. శనివారం వైవీయూ వాణిజ్యశాస్త్రశాఖలో కమ్యూనికేషన్స్ స్కిల్స్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. వర్క్‌షాప్‌ను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ సబ్జెక్టుకు సంబంధించి ఎంత విషయ పరిజ్ఞానం ఉన్నప్పటికీ అది వెల్లడించే నైపుణ్యత లేకపోతే అవకాశాలు దూరమవుతున్నాయన్నారు. ఉద్యోగాలకు దరఖాస్తు చేసేటపుడు బయోడేటా ప్రభావవంతంగా ఎలా తయారు చేయాలి, ఇంటర్వ్యూ మెలకువలు, వ్యక్తిత్వ లక్షణాలు, సంభాషణా నైపుణ్యాలు, ప్రవర్తనా నైపుణ్యాల గురించి ఉదాహరణలతో వివరించారు. నాయకత్వ లక్షణాలు, విమర్శనాత్మక ఆలోచనలు, బాధ్యతా విలువలు ప్రతి ఒక్కరు విద్యార్థి దశ నుంచే అలవర్చుకోవాలన్నారు. కామర్స్‌శాఖ విభాగాధిపతి, వర్క్‌షాప్ కన్వీనర్ ప్రొఫెసర్ ఎస్.రఘునాథరెడ్డి విద్యార్థుల సందేహ నివృత్తి చేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ విజయభారతి, విద్యార్థులు అధ్యాపకులు పాల్గొన్నారు.

27 నుంచి పీజీ మూడో సెమిస్టర్ పరీక్షలు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం, అనుబంధ పీజీ కళాశాలల మూడో సెమిస్టర్ విద్యార్థులకు ఈనెల 27వ తేదీ నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయని కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ కేఎస్‌వీ కృష్ణారావు తెలిపారు. ఎంఏ, ఎంకామ్, ఎంఎస్సీ, ఎంపీఎడ్, మూడో సెమిస్టర్ పరీక్షల టైం టేబుల్‌ను ఆయన ప్రకటించారు. ఈనెల 27, 29 డిసెంబరు 1,2,3,5,8 తేదీల్లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పరీక్షలు ఉంటాయన్నారు.

విద్యుత్‌షాక్‌కు గురై వ్యక్తి మృతి



ఎత్తపు శ్రీనివాసులరెడ్డి (ఫైల్)

రాజుపాలెం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొర్రపాడుకు చెందిన యత్తపు శ్రీనివాసులరెడ్డి (49) అనే రైతు శనివారం ఉదయం విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. భార్య సుబ్బలక్షుమ్మ ఫిర్యాదు మేరకు వివరాలిలా.. శ్రీనివాసరెడ్డి తన ఇంట్లో ఉన్న ఇన్వర్టర్ పనిచేయకపోవడంతో మరమ్మత్తు కోసం విప్పేందుకు ప్రయత్నించగా విద్యుత్ షాక్‌కు గురై కుప్పకూలి పడిపోయాడు. అతన్ని ప్రొద్దుటూరుకు తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడు శ్రీనివాసరెడ్డికి కొడుకు నవీన్, స్రవంతి అనే కూతురు ఉన్నారు.

గుంజనేరులో మహిళ మృతదేహం



మృతురాలి మెడలోని తాయెత్తు

చిట్వేలి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి సమీపంలోని గుంజనేరులో శనివారం ఉదయం ఓ మహిళ మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు ఆమె నాలుగు రోజుల క్రితమే మృతి చెంది ఉండవచ్చునని ప్రాథ మికంగా అంచనా వేశారు. కోడూరు రూరల్ సీఐ శ్రీనివాసులు సమక్షంలో పోస్టుమార్టం నిర్వహించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు వివరించారు. మృతదేహంపై తెలుపురంగు నైటీ, రెండు చేతులకు నాలుగు ఇత్తడి గాజు లు, మెడలో తాయెత్తు ఉందని, వివరాలు తెలిస్తే చిట్వేలి ఎస్ఐ 9121100579, కోడూరు రూరల్ సీఐ 9121100576 నంబర్లను సంప్రదించాలని కోరారు.

యువతి ఆత్మహత్యాయత్నం

ములకలచెరువు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): విషద్రావణం తాగి అమ్మాజాన్(23) ఆత్మహ త్యాయ త్నానికి పాల్పడిందని పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు... పెద్దపాళ్యం వాసి అమ్మా జాన్‌కు ఆరీఫుల్లాతో వివాహమైంది. అయితే భార్య భర్తలిద్దరూ విడాకులు తీసుకున్నారు. దీంతో అమ్మాజాన్ అదే గ్రామానికి చెందిన సునీల్‌తో సహజీవనం చేస్తూ గర్భిణి అయ్యింది. దీంతో తనను వివాహం చేసుకోవాలని కోరగా సునీల్, అతని కుటుంబీకులు నిరాకరించడంతో విషద్రావణం తాగింది. దీంతో కుటుంబీకులు హుటాహుటిన చికిత్స నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ విధులను మెరుగుపరచాలి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన జడ్జి యామిని

కడప రూరల్, నవంబర్ 22 (ఆంధ్రజ్యోతి): లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ విధులను మరింత మెరుగుపరిచి జాతీయ న్యాయసేవాధికార సంస్థ లక్ష్యసాధనకు పాటుపడాలని డీఎల్ఎస్ఏ చైర్‌పర్సన్, జిల్లా ప్రధాన జడ్జి డాక్టర్ సి.యామిని పేర్కొన్నారు. శనివారం ఆమె తన చాంబర్‌లో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ విధులపై రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన జడ్జి లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ విధులు, చట్టపరమైన సలహాలు, జైలు విజిట్లు, కేసుల వివరాలు.. వాటి పరిష్కారాలు తదితర అంశాలపై చర్చించి తగు సూచనలు ఇచ్చారు. అనంతరం న్యాయసేవాసదన్‌లో హిట్ అండ్ రన్ కేసులకు సంబంధించి జిల్లాస్థాయి అధికారుల మానిటర్ మీటింగ్ వర్చువల్ పద్ధతిలో నిర్వహించారు. పరిహారం, చెల్లింపు తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమాలలో డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాఫక్రుద్దీన్, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ హరిబాబు, రెవెన్యూ డివిజనల్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కార బాధ్యత జీఆర్ఏలదే..

- పొంతనలేని సమాధానాలిస్తే చర్యలు తప్పవు
- కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప కలెక్టరేట్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): అర్జీల పరిష్కారంలో గ్రీవెన్స్ రిడ్రెసల్ అథారిటీ అధికారులు (జీఆర్ఏలు) బాధ్యతగా వ్యవహరించాలని, పొంతనలేని సమాధానాలతో కాలయాపన చేస్తే చర్యలు తప్పవని కలెక్టర్ శ్రీధర్ చెరకూరి హెచ్చరించారు. శనివారం కలెక్టరే ట్‌లోని బోర్డు మీటింగ్ హాల్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదుల పెండెన్సీ, జీఆర్ఏ ప్రతి స్పందనలపై జేసీ అది తిసింగ్, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, ఎస్డీసీలు వెంకటపతి, రంగ స్వామిలతో కలసి సీఎంవో పీజీఆర్ఎస్ జిల్లా ఇన్‌చార్జి అధికారి సరళ, అన్ని డివిజన్ల రెవెన్యూ అధికారులతో ఫిర్యాదుల పరిష్కారం, ఆడిట్ అంశాలకు సంబంధించి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీదారుల సమస్యల పరిష్కారంలో పారదర్శకత ఉండాలన్నారు. సమాధానాలు సూటిగా ఇవ్వాలన్నారు. ఫిర్యాదులు అందిన 24 గంటల్లోగా సంబంధిత జీఆర్ఏ అధికారులు ఖచ్చితంగా ఎండార్స్ మెంట్ చర్యలు చేపట్టాలన్నారు. ఫిర్యాదుల ప్రాధాన్యత, ఫ్లాగ్ నోట్ చేయడంలో ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. తహశీల్దార్లు పైస్థాయి అధికారులు, సిబ్బంది ఫిర్యాదుదారుల సమస్యలు అందిపుచ్చుకునేలా ఉండాలన్నారు. ఎక్కడా కూడా కమ్యూనికేషన్ గ్యాప్ లేకుండా చేయాలన్నారు. కార్యాలయ వ్యవస్థను పదిలం చేయడంలో జీఆర్ ఏలు కీలక పాత్ర పోషించాలన్నారు. ఫిర్యాదుల పట్ల అలక్ష్యం చేస్తే శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. అన్ని శాఖల్లో పెండెన్సీ ఫిర్యా దులను వచ్చే నెలలోగా జీరోస్థాయికి తేవాలన్నారు. అలాగే గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టమ్‌లో భాగంగా ఆయా మండలాల ఫిర్యాదులను నమోదు చేస్తున్న పీజీఆర్ఎస్ సిబ్బందితో కలెక్టర్ మాట్లాడి తరచూ ఎదురయ్యే సమస్యలు, ఇబ్బందులను తెలుసుకొని సలహాలు, సూచనలు ఇచ్చారు. సమావేశంలో వీసీ ద్వారా సీపీవో ఓబులమ్మ, అన్ని డివిజన్ల ఆర్డీవోలు జాన్ ఇర్విన్, సాయిశ్రీ, చంద్ర మోహన్, చిన్నయ్య, డీఎస్పీ కరీం, అన్ని మండ లాల తహశీల్దార్లు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.



వీసీ ద్వారా అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ శ్రీధర్

రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు

కమలాపురం రూరల్/చెన్నూరు, నవంబరు 22 (ఆంధ్ర జ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రైతు సేవాకేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేపట్టిందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో జాన్ ఇర్విన్ తెలిపారు. శనివారం స్థానిక నాలుగో రైతు సేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. రైతులు దళారుల చేతిలో మోసపోకూడదన్న ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం గ్రామంలోనే రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తుందన్నారు. ఈ-పంటలో నమోదు చేసుకుని ఈకేవైసీ పూర్తి అయిన రైతులు, తమ ధాన్యం విక్రయించేందుకు సిద్ధమైతే కొనుగోలు చేస్తామన్నారు. తాము అమ్మదలచిన ధాన్యం వాట్సాప్ ద్వారా కూడా నమోదు చేసుకోవ చ్చన్నారు. అందుకు రైతులు 7337359375కు హాయ్ అని పంపాలన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బంది ఉన్నా టోల్‌ఫ్రీ నెంబరు 1967ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు శివరామిరెడ్డి, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



రామనపల్లెలో రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో జాన్ ఇర్విన్

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

చెన్నూరు మండలంలోని రామనపల్లెలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆర్డీవో జాన్ ఇర్విన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా రైతులు పండించిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని తెలిపారు. రామన పల్లెతో పాటు చెన్నూరులో కూడా కొనగోలు కేంద్రం ఏర్పాటు చేస్తున్నామన్నారు. రైతులు ఏ మాత్రం ఆందోళన పడ కుండా కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు సరస్వతి, వ్యవసాయాధికారి శ్రీదేవి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ రైతులకు మరింత ప్రోత్సాహం

పులివెందుల రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎరువులు, పురుగు మందులు వాడకుండా ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు పండించే రైతులకు మరింత ఆదాయం దక్కేలా చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ సంయుక్త సంచా లకులు చంద్రానాయక్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో వేరుశనగపంట సాగుచేసే రైతులను ప్రోత్సహించేలా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రానాయక్ మాట్లాడుతూ ఫార్మర్స్ ప్రొడ్యూసింగ్ (ఎఫ్‌పీఓ) ఆర్గనైజేషన్ సంస్థ ద్వారా గుర్తించి వారిని ప్రోత్సహించే దిశగా వేరుశనగ కాయలను పంపిణీ చేయడం జరుగుతోందన్నారు. నూనె గింజల ఉత్పత్తి పెంచడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఈ పథకం ద్వారా ఉచిత వేరుశనగ కాయలు పొందిన రైతులు తప్పనిసరిగా పంట సాగుచేయాలన్నారు. ఇ-క్రాప్‌లో నమోదు కావాలన్నారు. అవకతవకలకు పాల్పడితే రైతుల అకౌంట్‌ను రద్దు చేస్తామన్నారు. ముందుకు వచ్చే రైతులతో సంతకాలు కూడా తీసుకోవడం జరుగుతుందన్నారు. కావున ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పంట సాగుచేస్తే మరిన్ని పథకాలను పులివెందుల రైతులకు తీసుకొచ్చే చర్యలు చేస్తా మన్నారు. అలాగే ఇష్టానుసారం ఎరువులు, పురుగుమందుల వాడ కం వల్ల భూమాత తన స్వభావాన్ని కోల్పోతోందన్నారు. అంతే కాకుండా వాతావరణం కలుషితమై క్యాన్సర్ వ్యాధి ప్రబలు తోందన్నారు. కావున రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లాల న్నారు. అనంతరం పులివెందుల మండలంలోని కనంపల్లె, చిన్నరంగాపురం, పెద్దరంగాపురం, లింగాల మండలంలోని ఇప్పట్ల తదితర గ్రామాలకు చెందిన వంద మంది రైతులకు ఉచితంగా వేరుశనగ కాయలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పులివెందుల ఏడీఏ ప్రభాకర్ రెడ్డి, ఏవోలు చెన్నారెడ్డి, రమేష్, సీఎస్ఏ ఎన్జీఓ ఆదినారాయణ, జనార్దన్, ఎఫ్‌పీఓ అంకిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జేడీఏ చంద్రానాయక్

రాగి తీగలు, కేబుల్ చోరీ దొంగల అరెస్టు

పులివెందుల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రైతు పొలాల వద్ద ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ తీగలు, మోటర్ల వద్దనున్న కేబుల్ దొంగతనం చేస్తున్న ఇద్దరు దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. శనివారం డీఎస్పీ మురళినాయక్ తన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు తెలిపారు. లింగాల, తొండూరు, సింహాద్రిపురం, తదితర మండలాల్లో ఇటీవల రైతులకు సంబంధించిన మోటర్ల వద్ద కేబుల్‌వైర్లు, పొలాల వద్ద ఉన్న ఆరు ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్‌తీగలను దొంగలు ఎత్తుకెళ్లారు. దీనిపై రూరల్ సీఐ రమణ, లింగాల ఎస్ఐ అనిల్‌కుమార్‌ల ఆధ్వర్యంలో బృందంగా ఏర్పడి ఈ కేసులను చేదించారన్నారు. కర్ణాటక రాష్ట్రం బెంగుళూరుకు చెందిన జాఫర్ షరీఫ్, శివమొగ్గ జిల్లాకు చెందిన హరూన్ రషీద్, సత్యసాయి జిల్లా కొత్తూరు గ్రామానికి చెందిన హరిజన సురేంద్రలు ఈ దొంగతనాలకు పాల్పడ్డారన్నారు. జాఫర్ షరీఫ్‌కు ఒక సొంత కారు ఉందని, డ్రైవింగ్ చేసుకుంటూ జీవనం సాగిస్తుంటారన్నారు. మద్యం, జూదం వంటి వ్యసనాలకు బానిసకావడంతో దొంగతనాలకు అలవాటుపడ్డారన్నారు. ఇతనికి హరూన్ రషీద్ స్నేహితుడు, హరిజన సురేంద్ర వీరికి తోడై కేబుల్, వైర్ల దొంగతనాలకు పాల్పడ్డారన్నారు. పులివెందుల నియోజక వర్గంలోని రైతు పొలాల వద్ద ఉన్న ఆరు ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి, అందులోని కాపర్ తీగలను చోరీ చేశారని తెలిపారు. వీరు పగలు కారులో తిరుగుతూ ఎక్కడెక్కడ మోటర్లు ఉన్నాయని గుర్తించి దొంగతనాలకు పాల్పడేవారు. వీరిని శనివారం మధ్యాహ్నం 12గంటల ప్రాంతంలో లింగాల మండలం అంబకపల్లె గ్రామ సమీపంలో ఎస్ఐ అనిల్‌కుమార్ అరెస్టు చేశారన్నారు. వీరి వద్ద నుంచి రూ.2ల క్షల 85వేలు విలువ చేసే కేబుల్, కాపర్ వైరు రికవరీ చేశామన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ మురళినాయక్

శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కడప కలెక్టరేట్,నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మల్టీపర్పస్ హెల్త్ వర్కర్స్ (ఫిమెల్) శిక్షణ కోర్సులో (2025-26 విద్యాసంవత్సరానికి) ప్రవేశానికి అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీలోని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ కేంద్రాలలో శిక్షణ ఉంటుందన్నారు. సీఎఫ్‌డబ్ల్యు.ఏపీ.ఎన్ఐసీ.ఇన్ ద్వారా ప్రవేశ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో చేయాలన్నారు. కన్వీనరు, మేనేజ్మెంట్ కోటా సీట్లకు ఈ నెల 30 తేదీ చివరి గడువుగా పొడిగించినట్లు పేర్కొన్నారు.

గెస్ట్‌ఫ్యాకల్టీ పోస్టుకు ఇంటర్వ్యూలు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): వైవీయూ కంప్యూటర్ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగంలో గెస్ట్‌ఫ్యాకల్టీ నియామకం కోసం ఈనెల 25వ తేదీ ఉదయం 10గంటలకు వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ప్రొ.టి.శ్రీనివాస్ తెలిపారు. అభ్యర్థులు పీహెచ్‌డీ/ఎం.టెక్ (ఏదైన కంప్యూటర్ స్ట్రీమ్)/ఎంసీఏ అర్హత కలిగి ఉండాలన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు బయో-డేటా, సంబంధిత ఒరిజినల్, జిరాక్స్ కాపీల సెట్‌తో నేరుగా న్యూ ఆర్ట్స్ బ్లాక్‌లోని కంప్యూటర్ సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖలో ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు.

లక్ష్మీనరసింహ స్వామికి ప్రత్యేక పూజలు

బద్వేలు రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) :మున్సిపల్ పరిధిలోని వల్లెరవారిపల్లె గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మార్గశిర మాసం ప్రారంభాన్ని పురస్కరించుకుని స్వామివారికి అభిషేకం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్లను విశేషంగా అలంకరించారు. పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం పత్తి రవికుమార్ కుటుంబ సభ్యులు అన్నదానం చేశారు.

మహారాజశ్రీ బద్వేలు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
O.S. No. 523/2023
ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ వారి తరపున బ్రాంచ్ మేనేజర్, బి.మఠం శాఖ, బి.మఠం మం., కడపజిల్లా - వాది
V/s
2) ఆదిబోయిన గురవయ్య తండ్రి గురవయ్య, వయస్సు 50 సం. చెంచయ్యగారిపల్లె గ్రా., బి.మఠం మం., కడపజిల్లా - 2వ ప్రతివాది
పై నెంబరు దావాలో వాది, ప్రతివాది అయిన మీపైన లోను బాకీ రూ. 3,66,905/-లు రాబట్టుకొనుటకుగాను దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీకేమైనా అక్షేపణలున్న యెడల 27-11-2025వ తేది ఉదయం 10.30 గంటలకు పై కోర్టు వారి ఎదుట హాజరై తెలుపు కొనవలసినది. లేని యెడల మీ పరోక్షముగా దావాను తీర్మానించబడును.
ప్రదీప్ కుమార్ పవార్, నూతి శ్రీనివాసులు
వాది తరపు అడ్వకేట్స్, బద్వేలు,వై.ఎస్.ఆర్. కడపజిల్లా

మహారాజశ్రీ బద్వేలు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
O.S. No. 66/2024
ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ వారి తరపున బ్రాంచ్ మేనేజర్, బి.మఠం శాఖ, బి.మఠం మం., కడపజిల్లా - వాది
V/s
2) మాగిపోగు రత్నమయ్య తండ్రి రామయ్య, వయస్సు 51 సం. గొడ్లవీడు గ్రా., బి.మఠం మం., కడపజిల్లా - 2వ ప్రతివాది
పై నెంబరు దావాలో వాది, ప్రతివాది అయిన మీపైన లోను బాకీ రూ. 4,20,709/-లు రాబట్టుకొనుటకుగాను దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీకేమైనా అక్షేపణలున్న యెడల 25-11-2025వ తేది ఉదయం 10.30 గంటలకు పై కోర్టు వారి ఎదుట హాజరై తెలుపు కొనవలసినది. లేని యెడల మీ పరోక్షముగా దావాను తీర్మానించబడును.
ప్రదీప్ కుమార్ పవార్, నూతి శ్రీనివాసులు
వాది తరపు అడ్వకేట్స్, బద్వేలు,వై.ఎస్.ఆర్. కడపజిల్లా

PUBLIC NOTICE

On instructions from my client M/s Shriram Finance Ltd., Badvel Branch, rep. by its Manager, the public si nodified as follows :

One **Yeddula Prasad @ Lakshmi Prasad** S/o Chinna Devaraju, r/o D.No. 6-4-1101, Sundaraiah Colony, Badvel, Kadapa District has applied for loan to our firm and after going through documents of her right over the below mentioned property, my client-firm decided to grant loan to her. If anybody has got any righ/possession and title over the property or if any litigation is pending in any Court of Law, it shall be brought to the notice of my client, with documentary proof, within 5 days from the date of this notice, failing which my client will disburse the loan amount. Any objections received after 5 days they will not be taken into account.

Particulars of Property : Kadapa District, Kadapa Registration District, Badvel Sub-District, Badvel Municipality, Rudrampet, Ac. 0.08 cents or 387.2 Sq. Yards out of Ac. 0.72 cents in Sy.No. 1159 of Badvel Village fields - located near D.No. 3-2-511

Boundaries : East - Street Road, West - Backyard Sandhu Rastha and foundation of Yarriboyina Chennaiah, North - Foundation of Yeddula Devaraju, South - Drainage Canal.

P.RAJESWARA RAO
ADVOCATE, BADVEL.

PUBLIC NOTICE

Under the instructions of my client M/s Shriram Finance Ltd Kadapa Branch issues the following notice to the general public. My client intend to grant loan to **Sri Vadde Sreenivasulu S/o Vadde Siddaiah** residing at Plot No. 502, Y.M.R. Colony, Aravindasadan Apartment, Proddatur Proddatur Mandal, YSR Kadapa Dist by mortgaing the below schedule mentioned property as security by way of Registered mortgaged. And As such if anyone has any claims, objections charges or mortgages sale agreements, court attachments court disputes etc, shall be informed to the address mentioned below in within 5 days from the date of this notice, otherwise matter objections will not bind on my client not bind on my client in the regard, SCHEDULE OF THE PROPERTY: Item No.1B, Sy. No. : Schedule Survey No. 626, 626/-1 Extent Area (in acres / hec. Sq.Yds./ Sq.ft.) 17.4 Sq. Yards, Ac. 13.2 Sq. Yards Location (Address) : Residential Commercial Building Bearing D.No. 7/830, 7/831, 7/834 present newly build SS Mall Multiplex, First Floor, Room No. 15F and D.No. 7/384-152, Assessment No. 1014035159 and Room No. 5-F, D.No. 7/384-153 Vide Assessment no. 1014035158 situated at Korrapadu Road, Municipality Area, Proddatur Town, Proddatur Sub Distirct, YSR Kadapa District in Sy. No. 625, 626/1 to an extent of Ac. 2.27 Cents and 701 Sq. Links Boundaries 15-F: East : Room No. 16-F, West : Room No. 14-F & 6-F, North : Room No.5-F, South : Corridor Boundaries 5-F: East : Room No. 4-F, West : Room No. 6-F, North : Corridor and Open to sky, South : Room No. 15-F

Yours faithfully
SHAIK KHAJA MOHIDDIN
M.A. M.Phil. BL., Advocate & Notary

చెత్త రాదు.. సంపద సృష్టి లేదు

- నిరుపయోగంగా సంపద సృష్టి కేంద్రాలు
- సిమెంటు తొట్లలో మొలచిన గడ్డి, పిచ్చిమొక్కలు
- పంచాయతీలకు పెరగని ఆదాయం
- పట్టించుకోని అధికారులు



చాపాడులో నిరుపయోగంగా ఉన్న సంపద తయారీ కేంద్రం



సిమెంటు తొట్లలో మొలచిన గడ్డి, పిచ్చిమొక్కలు

చాపాడు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): సంపద తయారీ కేంద్రాలకు చెత్త రాదు.. సంపద సృష్టించడంలేదు. దీంతో కేంద్రాలు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. గత ఏడేళ్ల క్రితం గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో సంపద సృష్టి కేంద్రాలను నిర్మించారు. అప్పటి నుంచి ఈరోజు వరకు ఈ కేంద్రాలు వృథాగా పడి ఉన్నాయి. ఒక్కొక్క కేంద్రాన్ని రూ.5 లక్షల నుంచి రూ.9 లక్షల వరకు ఖర్చు పెట్టి నిర్మించారు. ఈ కేంద్రం వద్ద ఎనిమిది నుంచి 12 సిమెంటు తొట్లు నిర్మించారు. ఈ కేంద్రాల్లో వానపాములు పెంపకం చేపట్టి సేంద్రియ ఎరువు తయారు చేయాల్సి ఉంది. కానీ అలా జరుగలేదు. ఈ సిమెంటు తొట్లలో గడ్డి, పిచ్చిమొక్కలు మొలచి బీడు భూముల్లాగా మారాయి. మండలంలో 22 గ్రామ పంచాయతీల్లో 22 సంపద తయారీ కేంద్రాలు నిర్మించారు. ఇళ్లలోని కాగితాలు, రబ్బరు చెప్పులు, ఇతర వ్యర్థాలను గ్రీన్ అంబాసిడర్లు రిక్షాల్లో తీసుకునిపోయి సిమెంటు తొట్లలో నింపి సేంద్రియ ఎరువులను తయారు చేసి వాటిని రైతులకు విక్రయించాల్సి ఉంది. ఆ ఎరువుతో వరి, వేరుశనగ, పసుపు, పూలతోటలకు వాడాల్సి ఉంది. ఈ ఎరువుతో ఆరోగ్యకరమైన పంటలు పండించి ప్రజలు ఆరోగ్యంగా జీవించవచ్చు. ఈ కేంద్రాల కు చెత్తను తరలించేందుకు 36 మంది గ్రీన్ అంబాసిడర్లు నియమించి ప్రభుత్వం ఒక్కొక్కరికి రూ.6 వేలు జీతం ఇస్తున్నది. కానీ ఈ సంపద తయారు కేంద్రాలకు నిధుల కొరత ఏర్పడింది. దీంతో అవి పనికిరాకుండా ఉన్నాయి. ఈ సంపద తయారీ కేంద్రాలను రూ.1.5 కోట్లతో నిర్మించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఈ కేంద్రాలు పనిచేసే విధంగా తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నిధులు రాగానే పనులు చేపడతాం

నిరపయోగంగా ఉన్న సంపద సృష్టి కేంద్రాల విషయమై డిప్యూటీ ఎంపీడీవో హరినాథ్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా సంపద తయారీ కేంద్రాలు వృథాగా ఉన్న విషయం నిజమేనన్నారు. గ్రామ పంచాయతీలకు నిధుల కొరత ఉందన్నారు. నిధులు రాగానే తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

13న ప్రొద్దుటూరులో శ్రీనివాసకల్యాణం



శ్రీనివాస కల్యాణం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): గోవిందమాల భక్తబృందం ఆధ్వర్యంలో తిరుమల తిరుపతి దేవస్థానం వేద పండితులచే డిసెంబరు 13వ తేదీ ప్రొద్దుటూరు పట్టణంలో శ్రీనివాస కల్యాణం నిర్వహిస్తున్నట్లు గోవిందమాల భక్తబృందం సభ్యులు తెలిపారు. స్వామి కల్యాణానికి సంబంధించిన పోస్టర్లను శనివారం ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గోవిందమాల భక్తుల ఆధ్వర్యంలో వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహించడం అభినందనీయమన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి కల్యాణాన్ని తిలకించాలని కోరారు. గోవిందమాల సభ్యులు మాట్లాడుతూ స్వామివారి కల్యాణంను రెండవసారి పట్టణంలో నిర్వహిస్తున్నామని 13వ తేదీ శనివారం ఉదయం 9 గంటలకు ఆర్టీసీ బస్టాండు నుంచి కల్యాణ వేదిక వరకు స్వామివారి శోభాయాత్ర నిర్వహిస్తామని అనంతరం సాయంత్రం 5 గంటల నుంచి 8 గంటల వరకు అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూలు మైదానంలో టీటీడీ వేద పండితులతో స్వామివారి కల్యాణంను వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా టీటీడీ కళాకారులతో అన్నమాచార్య కీర్తనల ఆలాపన ఉంటుందన్నారు.

విద్యార్థులు వ్యక్తిత్వ వికాసాన్ని పెంచుకోవాలి

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి):విద్యార్థులు వ్యక్తిత్వ వికాసాన్ని పెంచుకోవాలని రీసోర్స్ పర్సన్ గుణశేఖర్ పేర్కొన్నారు. శనివారం స్టెప్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, కేరీర్ కౌన్సిలింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ గురుమూర్తిరెడ్డి, స్టెప్ ఇన్‌చార్జి సీఈవో సుబ్బరాయుడు మాట్లాడుతూ ఏదేశంలో లేని విధంగా మన దేశంలో 33 శాతం యువత ఉందని పేర్కొన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీసీ హాస్టల్‌ను సందర్శించిన సివిల్‌జడ్జి

బద్వేలు, నవంబర్ 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీసీ బాలుర వసతి గృహాన్ని శనివారం అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ముఖేష్‌కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా హాస్టల్ విద్యార్థుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం హాస్టల్‌లో భోజనం చేశారు. అంతకుముందు వంటగదిని పరిశీలించి ప్రభుత్వ మెనూ ప్రకారం విద్యార్థులకు రుచికరమైన భోజనం అందుతుందా? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను పరిశీలిం చారు. ఎస్‌డబ్ల్యుఓ నాగదాసరి ప్రసాద్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

భవిత కేంద్రంలో ఉచిత వైద్య శిబిరం

జమ్మలమడుగు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ సముదాయంలో భవిత కేంద్రంలో శనివారం సమగ్ర శిక్ష కడపవారి ఆధ్వర్యంలో నియోజకవర్గస్థాయిలో మెడికల్ అసెస్‌మెంట్ క్యాంపు నిర్వహించారు. 5 నుంచి 18 సంవత్సరాల వయస్సుగల దివ్యాంగ విద్యార్థులకు డాక్టర్ అలింకో స్క్రీనింగ్‌టెస్ట్ అవసరమైన వారికి ఉపకరణాలను ఇచ్చేందుకు గుర్తించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా సహిత విద్య కోఆర్డినేటర్ రమణమూర్తి పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఐఈఆర్‌పీలు చంద్రమోహన్, అర్చన, డాక్టర్లు మమత, నియోజకవర్గంలోని రీసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

లింగనిర్ధారణ చట్టరీత్యా నేరం

బద్వేలు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ , ప్రైవేటు ఆసుపత్రులలో స్కానింగ్ సెంటర్ల వారు లింగనిర్ధారణ చేయడం చట్టరిత్యా నేరమని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ వి.మల్లేష్ హెచ్చరించారు. శనివారం స్థానిక ఎన్‌జీవో హోంలో డిస్టిక్ లెవెల్ అడ్వయిజింగ్ కమిటీ సమావేశంలో వైద్యులు ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలన్నా రు. కార్యక్రమంలో వైద్యాధికారులు, సూపర్‌వైజర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిల్లోనే కాన్పులు నిర్వహించేలా చూడాలి



వైద్యులు, సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి నాగరాజు

దువ్వూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోనే కాన్పులు నిర్వహించేలా శ్రద్ధ పెట్టాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి నాగరాజు సూచించారు. దువ్వూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం ఆయన పరిశీలించి స్థానిక వైద్యాధికారులు సిబ్బందితో మాట్లాడారు. ప్రతినెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పది కాన్పులు జరిగే విధంగా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలని చెప్పారు. గర్భవతులను పరీక్షించడం, వారికి తగిన సలహాలు ఇవ్వడం, ఎప్పటికప్పుడు చేస్తుండాలని తెలిపారు. వీలైనంత వరకు కాన్పుల సంఖ్యను పెంచాలని తెలియజేశారు. కార్యక్రమంలో వైద్యులు రోషిణి, హేమలత, వీరి సిబ్బంది పాల్గొన్నారు.

వీఆర్‌ఏల సమస్యలను వెంటనే పరిష్కరించండి



వీఆర్‌ఏల సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర వైస్‌చైర్మన్ నాగేశం

బ్రహ్మంగారిమఠం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): గ్రామ రెవెన్యూ సహాయకులు సమస్యలు వెంటనే పరి ష్కరించాలని ఏపీ వీఆర్‌ఏ జేఏసీ వైస్‌చైర్మన్ నల్లిపోగు నాగేశం పిలుపునిచ్చారు. శనివారం బ్రహ్మంగారిమఠం మండల తహసీల్దారు కార్యాలయ ఆవరణలో మండల అధ్యక్షుడు బొట్ల నాగసుబ్బయ్య అధ్యక్షతన గ్రామ రెవెన్యూ సహాయకుల సమావేశం జరిగింది. ఈసందర్భంగా నాగేశం మాట్లాడుతూ 8 సంవత్సరాలుగా వీఆర్‌ఏల సమస్యలు ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా అలాగే ఉందన్నారు. కేవలం రూ.11వేల వేతనంతో కుటుంబ జీవనం ఎలాగడుస్తుందో ప్రభుత్వం ఆలోచించాలన్నారు. వీఆర్‌ఏలకు పే స్కేలు వెంటనే మంజూరుచేయాలని నామినీలుగా ఏళ్ల తరబడి పనిచేస్తున్న వారిని రెగ్యులర్ చేయాలని ప్రమోషన్ కోటాను 20 శాతం నుంచి 70శతంకు పెంచాలని, డీఏ వెయ్యి పెంచాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికై డిసెంబరు 16న మంగళగిరిలోని పీసీఎల్‌ఏ చీఫ్ సెక్రటరీ కార్యాలయం ఎదుట జరిగే ముట్టడికి రాష్ట్రంలోని వీఆర్‌ఏలందరూ హాజరై జయప్రదం చేయాలని నాగేశం పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల ప్రధానకార్యదర్శి పాణ్యం చెన్నయ్య, సీనియర్ నాయకులు కరుణ, అక్కిదాసరి అంద్రూస్, అంకాలి బ్రహ్మయ్య, మండల మాధవీ, కుట్టి పాల్గొన్నారు.

ప్రైవేటు విద్యాసంస్థల బస్సుల్లో భద్రత పాటించాలి



డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

మైదుకూరు నవంబరు22 (ఆంధ్రజ్యోతి):ప్రైవేటు విద్యాసంస్థలకు చెందిన బస్సులలో భద్రతా ప్రమాణాలు పాటించాలని డీఎస్పీ రాజేంద్ర ప్రసాద్ హెచ్చరించారు. చాలా వాహనాలకు సంబంధించిన రికార్డులు సక్రమంగా నిర్వహించడంలేదని పిర్యాదులు రావడంతో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు శనివారం మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలో ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలకు చెందిన బస్సులను డీఎస్పీ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ విద్యార్థుల భద్రత, రక్షణ అత్యంత ప్రాధాన్యంగా పరిగణిస్తూ చేస్తున్న తనిఖీలలో బాగంగా రోడ్డు భద్రతా నియమాలు, ట్రాపిక్‌రూల్స్‌పై డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈతనిఖీలలో సీఐ రమణారెడ్డి, ఎస్సై చిరంజీవి, సిబ్బంది పాల్గొన్నారు.

దళితులను భయపెడుతున్న వారిపై చర్యలు తీసుకోండి

బద్వేలు రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : భాకరాపేట సమీపంలోని ఎద్దుల ఈశ్వర్‌రెడ్డి కాలనీలో నివశిస్తున్న దళితులను భయభ్రాంతులకు గురి చేస్తున్న వైసీపీ నేత శ్రీకాంత్‌రెడ్డి, అతని అనుచరులపై తక్షణమే ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని సీపీఐ ఏరియా కార్యదర్శి పిడుగు మస్తాన్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. శనివారం సీపీఐ ఏరియా ప్రతినిధుల బృందం కాలనీని సందిర్శంచి వారి సమస్యలు అడిగి తలుసుకున్నారు. ఈసందర్భంగా మస్తాన్ మాట్లాడుతూ గత ఐదు రోజుల క్రితం శ్రీకాంత్‌రెడ్డి అనుచరులు కాలనీకి వచ్చి మీరు ఇక్కడ ఎలా కాపురం ఉంటారని బెదిరించారన్నారు. దళితులపై దాడి చేయడానికి ప్రయత్నించిన వారిపై బద్వేలు పోలీసుస్టషన్‌తోపాటు జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి బాలు, ఏరియా సహాయ కార్యదర్శి ఇమ్మానుయేలు, రమణ, వెంకటరమణ, నాగరాజు, పెంచలయ్య, మునిరత్నం పాల్గొన్నారు.

స్వామిత్వ సర్వేతో ప్రజలకు భరోసా

రాజుపాలెం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఎన్నో ఏళ్లుగా ఇళ్ల స్థలాలకు సంబంధించిన పత్రాలు లేక ఇబ్బందులు పడుతున్న ప్రజలకు స్వామిత్వ భరోసా కల్పిస్తుందని కొర్రపాడు గ్రామ పంచాయతీ సర్పంచ్ ధనిరెడ్డి శ్రీనివాసులరెడ్డి అన్నారు. శనివారం జడ్పీ ఉన్నత పాఠశాలలో గ్రామ సర్పంచ్ అధ్యక్షతన స్వామిత్వ గ్రామసభ నిర్వహించారు. స్వామిత్వ ద్వారా ఇల్లు స్థలాలకు సర్వే నిర్వహించారని వాటిలో ఇళ్ల కొలతలు ఏవైనా అభ్యంతరాలు ఉంటే ప్రజలు గ్రామసభలో ఫిర్యాదులు ఇవ్వాలన్నారు. సమావేశంలో డిప్యూటీ ఎంపీడీవో షాకిర్‌ఆలీఖాన్, రెవెన్యూ అధికారి అశోక్‌కుమార్, గ్రామ పంచాయతీ కార్యదర్శి రామాంజనమ్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

లాభాల బాటలో ప్రకృతి వ్యవసాయం

జమ్మలమడుగు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులో ప్రకృతి వ్యవసాయంలో సాగు చేసిన వరి పంట రైతులు లాభాల బాటలో ఉన్నారు. అందులో సిరిగేపల్లె గ్రామంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో రైతు గురుమూర్తి వరి పంట సాగు చేయగా శనివారం పంట కోత ప్రయోగం చేపట్టారు. ఎకరాకు 42 బస్తాలు దిగుబడి వచ్చిందని వాటికి ఖర్చు రూ.18,500 కాగా రూ.63,180. ఆదాయం వచ్చిందని రైతు తెలిపారు. యూనిట్ ఇన్‌చార్జి బాలనారాయణ, ఐసీఆర్‌పీలు పాల్గొన్నారు.

నిద్రలేమితో మానసిక సమస్య

మైదుకూరు రూరల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి) :నిద్రలేమితో మానసిక సమస్యలు వస్తాయని ఖాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ మ్యుబిన్ తెలిపారు. శనివారం మానసిక వ్యాధులపై అవగాహక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సైకియాట్రిక్ సోషల్ వర్కర్ బాస్కర్ మాట్లాడుతూ ఆరోగ్య సమస్యలు తలెత్తితే ట్రోల్‌ఫ్రీ నెంబర్ 14416 నెంబర్‌కు కాల్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగభూషణం,శోభన్‌బాబు,లక్ష్మీకాంతమ్మ,కేశవయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రాల ద్వారానే ధాన్యం కొనుగోలు



రైతు సేవాకేంద్రంలో కొనుగోలు చేస్తున్న ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో చంద్రమోహన్

పోరుమామిళ్ల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఆర్డీవో చంద్రమోహన్ సూచించారు. శనివారం ఆయన పోరుమామిళ్ల వ్యవసాయ డివిజను పరిధిలోని పోరుమామిళ్ల, కలసపాడు మండలంలోని చింతలపల్లె, పోరుమామిళ్ల మండలంలోని పోరుమామిళ్ల-1, బి.కోడూరు మండలంలోని బి.కోడూరు, కాశినాయన మండలలోని ఇటుకలపాడులో, బి.మఠం మండలంలోని చౌదరివారిపల్లెలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. నాణ్యత ప్రమాణాల ప్రకారం ఉన్న ధాన్యాన్ని కనీసం మద్దతు ధరకన్నా తక్కువగా ఏ రైతు అమ్ముకోవలసిన అవసరం లేదన్నారు. రైతు సమక్షంలోనే ధాన్యం కొనుగోలు చేస్తాన్నారు. గ్రేడ్-1 ధాన్యం క్వింటా రూ.2,389, సాధారణ రకం ధాన్యం క్వింటా రూ.2,369 చొప్పున చెల్లించి కొనుగోలు చేస్తారన్నారు. రైతులు ఎవరు కూడా అధైర్యపడకుండా ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవాలని ఉదయం 8 నుంచి రాత్రి 7 గంటల వరకు ఈ కేంద్రాలు పనిచేస్తాయన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు మురళీధర్‌రెడ్డి, ఏవో చంద్రమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

కలసపాడులో: మండలంలోని చింతలపల్లె రైతు సేవా కేంద్రంలో ఏర్పాటుచేసిన వరికొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆర్డీఓ చంద్రమోహన్ సందర్శించి రైతులకు పలు సూచనలిచ్చారు. వరి రైతుల రిజిస్ట్రేషన్, డీసీఎంఎస్ కొనుగోలు ప్రక్రియ గురించి రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులలు మురళీధర్‌రెడ్డి, తహసీల్దార్ మధురవాణి, ఏఓ విజయ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

వరి ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

రాజుపాలెం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : రాజుపాలెం మండలంలోని వెలవలి గ్రామం రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మండల తహసీల్దారు మనోహర్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ మహబూబ్‌బాషా శనివారం పరిశీలించారు. వరి ధాన్యం 75 కేజీలు ఏ గ్రేడ్ రకం రూ.1792, సాధారణ రకం 75 కేజీలు రూ.1777లతో కడప డీసీఎంఎస్ ద్వారా కొనుగోలు చేస్తామని తెలిపారు. వరి ధాన్యం తేమ శాతం 17 లోపల ఉండానల్నారు. వరి ధాన్యాన్ని అమ్మదలుచుకునే రైతులు రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలని వ్యవసాయాధికారి ఎస్.శివరామక్రిష్ణారెడ్డి తెలిపారు.

అర్హులైన రైతులకు డీసీసీబీ ద్వారా రుణాలిస్తాం



అట్లూరులో రైతులతో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ సూర్యనారాయణరెడ్డి

అట్లూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : అట్లూరు మండలంలోని అర్హులైన రైతులందరికీ డీసీసీబీ ద్వారా రుణాలు అందిస్తామని డీసీసీబీ ఛైర్మన్ మంచూరి సూర్యనారాయణరెడ్డి వెల్లడించారు. శనివారం అట్లూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో రైతులతో సమావే శం నిర్వహించారు. దీర్ఘకాలిక రుణాలు, పంట రుణాలు సబ్సిడీతో కూడిన వ్యవసాయ పనిముట్ల కోసం అర్హులైన రైతులందరూ వ్యవసాయ పరపతి సంఘంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అలాగే అట్లూరు నందు డీసీసీబీ ద్వారా ఎరువుల దుకాణాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అలాగే రైతులకు డ్రోన్ సదుపాయం కూడా కల్పిస్తామన్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా పండించే రైతులకు సబ్సిడీతో కూడిన ట్రాక్టర్లు మంజూరు చేస్తామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ వ్యక్తిగత రుణాలు మంజూ రు చేస్తామన్నారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టరు రాధాక్రిష్ణారెడ్డి, మండల టీడీపీ ఇన్‌చార్జ్ రెడ్డయ్య, నాయకులు అరవ శ్రీనివాసులరెడ్డి,ఈశ్వర్‌రెడ్డి, కుంభగిరని ఎంపీటీసీ చిన్నగంయ్య, సొసైటీ సీఈవో సుబ్బారెడ్డి, క్రిష్ణారెడ్డి, పరశురాం , రైతులు పాల్గొన్నారు.

ఇన్‌సర్వీస్ టీచర్లకు టెట్ మినహాయింపు ఇవ్వండి



టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న ఎస్టీయూ ఉపాధ్యాయులు


జమ్మలమడుగు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఇన్‌సర్వీస్ టీచర్లకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని జమ్మలమడుగు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డికి ఎస్టీయూ నేతలు వినతి పత్రం ద్వారా విన్నవించారు. శనివారం ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ గురుకుమార్ తదితరులు మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఎవరైతే 2010 ముందు ఉపాధ్యాయ నియామకాలు పొందారో వారందరిని కూడా టెట్ పాస్ కావాలని ప్రస్తుతం చెప్పడం జరిగిందని, ఎస్టీయూ నాయకులు భూపేశ్‌రెడ్డికి తెలిపారు. డీఈడీ, బీఈడీ ఎంట్రెన్స్ ద్వారా సీటు పొంది తర్వాత డీఎస్సీ సెలక్షన్ లిస్టు ద్వారా నియామకం పొందిన ఉపాధ్యాయులను మళ్లీ టెట్ పాస్ కావాలని చెప్పడం సరికాదన్నారు. భూపేశ్‌రెడ్డి స్పందిస్తూ తప్పకుండా ఈ సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి దృష్టికి తీసుకెళతానని ఉపాధ్యాయులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్టీయూ ఉపాధ్యాయులు భాస్కర్, గురుకుమార్, గౌస్, శివరాం, శివరామిరెడ్డి, రాజశేఖర్, ఓబులేసు, గురుస్వామి, దామోదర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

'టికెట్ ఎవరికి ఇచ్చినా విజయానికి సహకరిస్తా'

జమ్మలమడుగు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు నియోజకవర్గానికి సంబంధించి వైసీపీ తరుపున టికెట్ ఎవరికి ఇచ్చినా తాను విజయానికి ముందుండి సహకరిస్తానని జమ్మలమడుగు మాజీ ఎమ్మెల్యే వైసీపీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ మూలె సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం జమ్మలమడుగు పట్టణంలోని ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ అధిష్టానం చెప్పిన విధంగా తాను నడుచుకుంటానన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు కొమెర్ల మోహన్‌రెడ్డి, పోరెడ్డి మహేశ్వర్‌రెడ్డి, వల్లంబావిగారి రుషికేశవరెడ్డి, రాఘవరెడ్డి, తానేషావలి, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుల ఆప్షన్ దుర్వినియోగపరుస్తే కేసులు తప్పవు


- రేషన్ డీలర్ల సమావేశంలో తహసీల్దారు గంగయ్య



రేషన్ డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దారు గంగయ్య

ప్రొద్దుటూరు , నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రతి నెలా 26నుంచి 30 వ తేదీ వరకు 65 ఏళ్లు పైబడిన వృద్ధులకు ఇంటివద్దకు వెళ్లి రేషన్ పంపిణీ చేసే ఆప్షన్‌ను రేషన్ డీలర్లు దుర్వినియోగం చేస్తున్నారని అలాంటి వారిపై 6ఏ కేసులు నమోదు చేస్తామని తహసీల్దారు గంగయ్య హెచ్చరించారు. శనివారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో రేషన్ డీలర్లతో సమావేశం గంగయ్య మాట్లాడుతూ ప్రతినెల 26 నుంచి 30 వరకు రెగ్యులర్ రేషన్ కార్డుదారులకు కూడా బయోమెట్రిక్ తీసుకుని ఆన్‌లైన్ చేస్తున్నారని నేరుగా కార్డుదారులకు డబ్బులు ఇచ్చి ఇళ్లవద్దనే బియ్యం కొనుగోలు చేస్తున్నారని ఆరోపణలు వచ్చాయన్నారు. ఈతేదీలలో ఆన్‌లైన్‌లో రెగ్యులర్ కార్డుదారులకు పంపిణీ చేసి నట్లు రికార్డు అయితే కేసులు నమోదు చేస్తామన్నారు. ఐసీడీఎస్ వారికి సకాలంలో సరుకులు పంపిణీ చేయాలన్నారు. కార్డు దారుల ఈకేవైసీ తక్షణం పూర్తి చేయాలని మండలంలో 9380 ఈకేవైసీ పెండింగ్ ఉన్నాయన్నారు. సమావేశంలో సివిల్ సప్లయ్ డిప్యూటి తహసీల్దారు ఎం శివప్రసాద్, ఎఫ్ఐ మహేంద్రనాధ్‌రెడ్డి డీలర్లు పాల్గొన్నారు.

సీఐని కలిసిన కాశినాయన టీడీపీ నాయకులు



కాశినాయన నవంబరు 22(ఆంధ్రజ్యోతి) పోరుమామిళ్ళ సర్కిల్‌కు నూతన సీఐగా బాధ్యతలు చేపట్టిన హేమసుందర్‌రావును శనివారం కాశినాయన మండల టీడీపీ నాయకులు మర్యాద పూర్వంకగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. మండల సొసైటీ చైర్మన్ బంగారు గుర్విరెడ్డి అధ్యక్షతన పార్టీ నాయకు లు ఆయనకు శాలువాకప్పి పూలమాలతో సత్కరించారు. ఈకార్యక్రమంలో మండల తెలుగు యువత అధ్యక్షుడు పంగా రవీంద్రారెడ్డి, టీడీపీ నాయకులు శ్రీనివాసులరెడ్డి, విజయ్‌కుమార్ రెడ్డి, బి.వెంకట్రామిరెడ్డి (సీడ్స్) ,ఓ.రోహిత్‌రెడ్డి,దుగ్గిరెడ్డి పాల్గొన్నారు.